
వార్త
ఆదివారం
4 డిసెంబరు, 2022
భూతాపం
భవితకు శాపం

# సత్యదేవ్ సినిమాలో హీరోయిన్‌గా జెన్నిఫర్ పిచినెటో



టాలీవుడ్‌లోకి మరో విదేశీ భామ అడుగు పెట్టబోతోంది. ఇప్పటికే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలో ఒలీవియా మోరిస్ మెరిసిన సంగతి తెలిసిందే. తాజాగా బ్రెజిల్ అందాల భామ జెన్నిఫర్ పిచినెటో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. సత్యదేవ్ 26వ చిత్రంగా తెరకెక్కుతున్న సినిమాలో ఈ భామ నటించబోతోంది. ఈ చిత్రంలో డాలీ ధనుంజయ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇందులో మరో హీరోయిన్‌గా ప్రియా భవానీ శంకర్‌ను తీసుకున్నారు.

ఇక క్రైమ్ యాక్షన్ ఎంటర్టైయినర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కొనసాగుతోంది. బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ తాజా చిత్రం 'రామ్ సేతు'లో ముఖ్య పాత్రను పోషించిన జెన్నిఫర్ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంది. బ్రెజిలియన్ మోడల్‌గా జెన్నిఫర్‌కు మంచి ఫాలోయింగ్ ఉంది. తెలుగు ప్రేక్షకులను ఈ భామ ఎంత వరకు మెప్పిస్తుందో వేచి చూడాలి మరి.

## తారాతీరం

# విజయ్ దేవరకొండ సినిమాలో మాధవన్?



సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ-సమంత కలయికలో శివ నిర్వాణ ఒక సినిమా చేయబోతున్న సంగతి విదితమే. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో మరో ప్రత్యేక పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. సెకండాఫ్‌లో వచ్చే ఈ కీలక పాత్రలో తమిళ నటుడు మాధవన్ నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం గురించి ఇంతవరకు అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమా కథ ఒక మెచ్యూర్డ్ లవ్ స్టోరీ అని తెలుస్తోంది. శివ నిర్వాణ సినిమా అంటేనే హుందాగా ఉండే ప్రేమ కథలకు కేరాఫ్ అడ్రస్. ఆయన గత చిత్రాలు 'మజిలీ', 'నిన్ను కోరి'లో హృదయానికి హత్తుకునే ప్రేమ కథలు ఉంటాయి. ఆ తరహాలోనే విజయ్ దేవరకొండ చిత్రం కోసం కూడా మంచి ప్రేమ కథను రాసుకున్నారట శివ నిర్వాణ.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
4 డిసెంబరు, 2022

## మంచి ముత్యాలు

ప్రకృతికి విధేయులమై ఉన్నప్పుడే దానిని మనం ఆజ్ఞాపించగలం.

- ఫ్రాన్సిస్ బేకన్

## విషయ విశేషం


పది రూపాయలకు ఒక వడ,మూడు ఇడ్లీలు... 4

'సంఘీ'భావం....5

పెరుగుతున్న వ్యక్తిగత దూషణలు

మౌంట్ సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరం...6

కవర్ స్టోరీ..8

భూతాపం

భవితకు శాపం

ఈవారం కవిత్వం..12

అలికిడి

అందంగా ఉన్నాయని.....14

ఎల్లలు దాటిన 'మధుబని' కళ....18

కథ.. 20

సంసారానికి సగం జీతం

సాహిత్యం.. 23

తెలుగు పత్రికారంగం తీరుతెన్నులు

ఏడేళ్ల తర్వాతే పంపుతాం..26

తిక్క శంకరయ్య... 30

ఇంకా..


పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


సరదాగా కాసేపు..

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## కాయిన్‌లో శుభాకాంక్షల వీడియో




మనకిష్టమైన వారికి సరికొత్తగా శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వీడియో గ్రీటింగ్ కార్డుల గురించి తెలిసిన విషయమే. వాటికి భిన్నంగా ఇప్పుడు అందరూ మరింత ఆశ్చర్యపోయేలా 'అవుగ్రావ్' అనే సంస్థ వీడియో గ్రీటింగ్ కాయిన్ తీసుకొచ్చింది. వెండి, బంగారు నాణేలలో వీడియో కనిపించేలా తయారు చేస్తోంది. నాణెం మీదున్న క్యూఆర్ కోడ్‌ని ఫోన్‌లో స్కాన్ చేస్తే అందులో నిక్షిప్తమై వున్న వీడియో తెర మీద కనిపిస్తుంది. పండగ శుభాకాంక్షలు, పాట, మనకు నచ్చిన దేన్నయినా వీడియో రూపం లో తయారు చేయించుకోవచ్చు. బహుమతి అందుకునేవారి అభిరు చులను బట్టి ఆర్డర్ ఇచ్చి ఈ వీడియో కాయిన్లను తయారు చేయించుకోవచ్చు. కాగితపు గ్రీటింగ్ కార్డులకు బదులు ఎప్పటికీ ఉండిపోయే లోహపు వీడియోల్ని పది కాలాల పాటు పదిలపరచుకోవచ్చు.

### బ్రేస్‌లెట్ కమ్ ఛార్జర్



ఇప్పుడు అందరికీ ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. అందుకే చాలామంది ఫోన్‌తో పాటు ఛార్జర్ కేబుల్నీ జతగా తీసుకెళుతున్నారు. తయారీదారులు ఈ విషయం గ్రహించి వినియోగదారులకు వెసులుబాటు కల్పించ డానికి బోలెడన్ని ఛార్జర్ కేబుళ్లని మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. అందులో ఒకటి.. 'బ్రేస్‌లెట్ యూఎస్‌బీ కేబుల్'. వివిధ రకాల మోడళ్లలో ఉండే ఈ కేబుల్ బ్రేస్‌లెట్‌ని సరదాగా చేతికి పెట్టుకో వచ్చు. లేదంటే ఫోన్‌కే యాక్సెసరీలా పెట్టేయొచ్చు. అవసరమైన ప్పుడు ఛార్జర్‌లా వాడుకో వచ్చు. అన్నిరకాల ఫోన్లకు సంబం ధించిన పిన్నులతో ఈ చార్జెర్లు అందుబాటులో ఉన్నాయి.





# పది రూపాయలకు ఒక వడ, మూడు ఇడ్లీలు



పది రూపాయలకు సింగిల్ టీ రావడం లేదు ఈ రోజుల్లో. అలాంటిది ఒక వడ, మూడు ఇడ్లీలా? ఇది నిజమే. కానీ హైదరాబాద్‌లో కాదు కర్ణాటకలో. హుబ్లీకి చెందిన నాగరాజా బద్ది అనే యువకుడు చిన్న కప్పు టీ కప్పు కూడా రాని ధరతో మూడు ఇడ్లీలు, ఒక వడ్డ అందిస్తున్నాడు. పన్నెండు సంవత్సరాలుగా ఇదే ధరను కొనసాగిస్తున్నాడు. అయితే ఈ సౌలభ్యం రోజంతా ఉండదు. ఉదయం 7.30 గంటల నుండి 10.30 గంటల వరకు ఉంటుంది. మూడు గంటలు మాత్రమే ఈ అల్పాహారం అందుబాట్లో ఉంటుంది. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు క్యూలో నిలబడి ఉంటారు. దీంతో పాటు రుచికరమైన సాంబార్, చట్నీ ఉంటుంది. పేదలకు, నిరుపేదలకు అన్నదానం చేస్తూ అనేక సందర్భాల్లో ఔదార్యం చాటుకుంటున్నాడు. చిన్నప్పుడు తాను పడిన కష్టాలను మరెవ్వరూ పడకూడదని అతను ఇలా చేస్తున్నాడు. పది మంది కడుపు నింపడం అతనికి చాలా సంతోషంగా ఉందట.

పన్నెండు సంవత్సరాల నుండి ధర పెంచలేదు. ఇక పెంచే ఉద్దేశం కూడా లేదట. ప్రజల ఆశీస్సులతో నాకు తృప్తిగా ఉంది. లాభం కంటే కస్టమర్ సంతృప్తే ఎక్కువ తృప్తినిస్తోంది అంటున్నాడు. ఈ హోటల్‌లో ఇడ్లీ, వడతో పాటు తమ ప్రేమను కూడా పంచుతారని కస్టమర్లు అతణ్ణి ప్రశంసిస్తున్నారు. ధరలు మండిపోతున్న ఈ కాలంలోనూ పది రూపాయలకే పుష్టికరమైన అల్పాహారాన్ని అందిస్తున్న అతని సేవానిరతిని మెచ్చుకోవాల్సిందే! ❏





# 'సంఘీ' భావం



## పెరుగుతున్న వ్యక్తిగత దూషణలు

గత కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలు నానాటికీ దిగజారుడుగా మారుతున్నాయి. పార్టీ సిద్ధాంతాలు, పనితీరు, పథకాలపై చేయాల్సిన విమర్శలు, పరస్పర ఆరోపణలు పరిధి దాటి జరుగుతున్నాయి. సైద్ధాంతికపరమైన అంశాలను పక్కకు నెట్టి వ్యక్తిగత దూషణలకు పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. వ్యక్తిగత అంశాలను ప్రస్తావించడమే కాకుండా మహిళలను కూడా అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో రాజకీయాలతో సంబంధం లేకుండా జీవనం సాగిస్తున్న రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులపై కూడా అసభ్యపదజాలం ఉపయోగిస్తున్నారు. గతంలో ఒక మంత్రిగాని, రాజకీయ నాయకుడుగాని మీడియా ముందుకో, ఏదైనా వేదిక నుంచో మాట్లాడితే రాజకీయ పరమైన అంశాలు మాత్రమే ఉండేది. పథకాల అమలులో లోపాలు, ఆర్థికపరమైన విషయాలపై విమర్శలు జరిగేవి. రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం వ్యక్తిగతమైన ఆరోపణలతో రాజకీయ నాయకులు, కొందరు మంత్రులు కాలయాపన చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ పనితీరు మరింతగా దిగజారిపోతోంది. సరైన పథకాలు సక్రమంగా అమలుకావడం లేదు. వ్యక్తిగత దూషణలతో అసలు సమస్యలు మూలపడుతున్నాయి. నిరుపేదలు, సామాన్యులు ప్రభుత్వం నుంచి తమకు సహాయం అందుతోందని ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో నేతల వైఖరి వారికి నిరాశను కలిగిస్తోంది. బహిరంగ సభల విషయాన్ని అటు ఉంచితే ఇక అసెంబ్లీలో కూడా కేవలం ఆరోపణలుతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. చాలా సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీలు సరైన పంథాను అనుసరించలేకపోతున్నాయి. గతంలో కూడా అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు కొంత వరకు సమయం వృథా అయిన సందర్భాలు లేకపోలేదు. అయితే 60 నుంచి 80 శాతం వరకు సమస్యలు, పథకాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భారీ ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో అవినీతి వంటి అంశాలపై చర్చ జరిగేది. ఒక్కొక్కసారి నాలుగైదు రోజుల పాటు తమకు అధికార పార్టీ నుంచి సమాధానం వచ్చే వరకు ప్రతిపక్షాలు వ్యూహాత్మకంగా ముందుకు సాగేవి. అనేక సందర్భాల్లో అసెంబ్లీలో జరిగిన చర్చకు ప్రాధాన్యం ఇస్తూ అధికారపార్టీ తమ లోపాలను సరిదిద్దుకునే వారు. అప్పట్లో సభ నుంచి సభ్యులను సస్పెండ్ చేసినా, వాకౌట్ చేసినా ఒక సమయం, సందర్భం ఉండేది. ఇప్పుడు అలాంటి దాఖలాలు కనిపించడం లేదు. సభ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్షాలను నిరోధించడానికి అధికార పార్టీ, అధికార పార్టీని ఇబ్బంది పెట్టడానికి ప్రతిపక్షాలు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. దీనితో సభ ప్రారంభంలోనే సభ్యులను సస్పెండ్ చేసి ఏకపక్షంగా సభలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల సభ ప్రశాంతంగా జరిగిందన్న సంతృప్తి అధికార పార్టీకి ఉన్నా కీలక అంశాల్లో తాము చేస్తున్న తప్పులను తెలుసుకునే అవకాశాన్ని కోల్పోతున్నామన్న భావన అధికారపార్టీలకు ఉండటం లేదు. ఇదే పరిస్థితి ప్రతి పక్షంలో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఏదైనా లోపాన్ని లేవనెత్తే సమయంలో అధికారం పార్టీ నుంచి సమాధానాన్ని రాబట్టేందుకు ఓపికతో వ్యవహరించలేకపోతున్నారు. బిగ్గరగా నినాదాలు చేయడం, పోడియం వద్దకు దూసుకువెళ్లడం వంటి చర్యలతో సస్పెన్షన్లకు గురికావడమో, వాకౌట్‌లు చేయడం వంటి విధానాలకు పాల్పడుతున్నారు. దీనితో ప్రభుత్వం చేసే తప్పిదాలు ప్రజలకు తెలియడం లేదు. ప్రజాసమస్యల పరిష్కారం, ఇబ్బందులు తెలపడానికి వేదికగా ఉండాల్సిన అసెంబ్లీ సమావేశాలు సంతమార్కెట్‌ల కంటే అధ్వాన్నంగా ఉంటున్నాయి. గతంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే మేధావులతో పాటు సామాన్య ప్రజానీకం కూడా ఆసక్తిగా గమనించే వారు. క్రికెట్ మ్యాచ్‌లను ఎంత ఆసక్తిగా చూస్తారో అంతేకంటే ఎక్కువ శ్రద్ధ పెట్టి సమావేశాలను వీక్షించే వారు. ప్రతి సమావేశం జరిగిన తరువాత సామాన్యులకు ఉపయోగ పడే పనులు కనీసం రెండు మూడు ఉండేవి. అయితే ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పథకాలు పక్కదారి పడుతున్నా ప్రశ్నించేవారు లేకుండా పోయారు. గతంలో కొన్ని ఉద్యమ పార్టీలు ప్రజల సమస్యలపై స్పందించే వారు. ప్రస్తుతం అధికారపార్టీ పంచన చేరి వారేమీ చేసినా ప్రశ్నించడానికి సాహసించలేకపోతున్నారు. దీనిలో వీరు ప్రజల్లో క్రమంగా విశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఇప్పటికే దాదాపుగా వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఆయా పార్టీలు తమ సిద్ధాంతాలకు ప్రాధాన్యత ఇస్తే మళ్లీ ప్రజల్లో స్థానం సంపాదించుకునే అవకాశం ఉంటుంది. ఉద్యమపార్టీల ప్రభావం తగ్గిపోవడం అధికార పార్టీలకు మరింత ఉత్సాహం కలిగిస్తోంది. తాము చేసే పనులను ప్రశ్నించే వారు లేకుండా పోయారన్న ధీమా ఎకువైంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడా సరైన వ్యూహం లేకుండా ముందుకు వెళ్లడంతో అధికారపార్టీని ఎదుర్కోవడంలో విఫలమౌతున్నాయి. రాజకీయాల్లో ఇటువంటి విధానాలు రావడం వల్ల ఆయా పార్టీల పరిస్థితి అటుంచితే సామాన్య ప్రజల జీవితాలు మాత్రం అధ్వాన్నంగా మారుతున్నాయి. తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని కనీసం కలిసే అవకాశం కూడా ఉండటం లేదు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఒకసారి ఎన్నికల్లో గెలిస్తే మళ్లీ ప్రజల వైపు చూడటం లేదు. ఎన్నికలు వచ్చిన వెంటనే నోట్ల కట్టలు, మద్యం సీసాలు, ప్రలోభాలు వంటివి ఓటర్ల ముందుంచి ఓట్లు సాధించుకుంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఓటర్లు ప్రలోభపడకుండా నిజాయితీగా వ్యవహరిస్తే రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు వస్తాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

రోపాలోనే అపురూప కట్టడంగా విరాజిల్లుతోంది మౌంట్ సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరం. ఇది ఫ్రాన్స్‌లోని ప్యారిస్ నగరం పశ్చిమాన నార్మండీ తీరాన ఉంది. ప్యారిస్ నుండి నాలుగు గంటల పాటు ప్రయాణం చేస్తే ఈ అద్భుత ప్రార్థనా మందిరాన్ని చేరుకోవచ్చు. నార్మండీ తీరంలో ఒక కిలోమీటర్ విస్తీర్ణంలో ఉన్న రాతి ద్వీపంపై గోతిక్ శైలిలో నిర్మించారు. ఇది మధ్య యుగానికి చెందిన ఒక చారిత్రాత్మక నిర్మాణం. 1979లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వం కట్టడంగా ప్రకటించిన ఈ చర్చిని ప్రతి ఏడాది పాతిక లక్షల మంది భక్తజనులు,



# మౌంట్ సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరం

**షేక్ అబ్దుల్ వాకీం జాని**

పర్యాటకులు ప్రపంచం నలుమూలల నుండి వచ్చి సందర్శిస్తుంటారు. అట్లాంటిక్ సముద్రం అలలపై నిలబడినట్లు దాదాపు ఒక కిలోమీటర్ దూరానికి కనపడేలా 160 మీటర్ల ఎత్తయిన చిన్న కొండపై ఈ భవ్య నిర్మాణం నెలకొని ఉంది. ఐరోపా శిల్ప కళా చాతుర్యానికి ఇదో మచ్చుతునక. ఇది రోమన్ క్యాథలిక్ చర్చి. 10వ శతాబ్దంలో లభించిన కొన్ని రాత ప్రతుల వల్ల ఈ చర్చికి సంబంధించిన ఒక కథ ప్రచారంలో ఉంది. దీని ప్రకారం అవ్రాంచెస్ ఆబర్ట్ అనే బిషప్‌కు క్రీ.శ.708లో ఒక రాత్రి కలలో మైఖేల్ దేవత కనిపించి సమీపంలో ఉన్న మౌంట్ శిఖరంపై క్రీస్తు మందిరాన్ని నిర్మించమని ఆదేశించింది. అలా ఈ చర్చి నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అనుకున్నదే తడవు ఈ చర్చి నిర్మాణం జరగలేదు. ఆ తరువాత క్రీ.శ.966లో నార్మండీ రాజు రిచార్డ్-1 కొంత మందిని చర్చి నిర్మాణానికై ఈ ప్రాంతానికి పంపాడు. వారంతా ఈ ప్రాంతాన్ని బాగా పరిశీలించారు. చర్చి నిర్మాణం కోసం ఈ కొండపై నిలబడేందుకు వీలుగా పరంజాలు కూడా నిర్మించారు. అలా బెనెడిక్ట్స్ సంఘం తొలిసారిగా ఈ చర్చిని నిర్మించింది. 11వ శతాబ్దంలో ఇక్కడ అనేక నిర్మాణాలు చేశారు. 13వ శతాబ్దంలో రెండు భవనాలు, సన్యాసుల కోసం ఒక మఠాన్ని నిర్మించారు. నాలుగు గర్భగృహాలు, కోటలు నిర్మించి అనేక రక్షణ చర్యలు చేపట్టారు. ఫ్రెంచ్ విప్లవం సమయంలో ఇక్కడ ఖైదీలను బంధించి ఈ కోటను జైలులా కూడా ఉపయోగించారు. ఆ సమయంలో సన్యాసులు ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోయారు.

### ఐరోపా వాసులకు యాత్రా స్థలం


ఇప్పుడు సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరం ఐరోపా వాసులకు ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక యాత్రా స్థలంగా మారింది. మైఖేల్ భవంతి మధ్య యుగాలలో గొప్పగా విరాజిల్లింది. క్రీ.శ.966లో నార్మండీ రాజు రిచార్డ్-1 దాదాపు 30 మంది భిక్షువులను సెయింట్ మైఖేల్ వద్దకు క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని నిర్మించడానికి పంపాడు. కానీ వారి ముందున్న కర్తవ్యం ఎంతో కష్టంతో కూడుకున్నది. అతి పెద్ద సమస్యగా భావించారు. ప్రార్థనా మందిరం నిర్మించ డానికి వంద మీటర్ల పొడవు గల స్థలం కావలసి ఉంది. ఆ రాతి పర్వతం గోపురంగా ఉంది. నిర్మాణం నిలబడేందుకు వీలుగా పరంజాలు నిర్మించవలసి వచ్చింది. నిర్మాణం పూర్తయిన పిదప సర్వసంగ పరిత్యాగుల కోసం ఇక్కడే ఒక మఠం కూడా కట్టారు. ఇక్కడ కొండపై చర్చి నిర్మిస్తున్న సమయంలోనే మఠం కూడా నిర్మించారు. అయితే మఠం చర్చి కంటే కొంత దిగువున ఉంటుంది. సంఘ కాపరులతో పాటు మేధావులు కూడా ఇక్కడ బస చేస్తూ వచ్చారు. రాబర్ట్ డి.తుర్గిని ఈ మఠంలోని గ్రంథాలయాన్ని తన రాత ప్రతులతో నింపాడు. ఈ కారణంగా ఈ మఠాన్ని 'టౌన్ ఆఫ్ బుక్స్' అని కూడా పిలుస్తూ వచ్చారు. చర్చి కింది భాగంలో ఈ మఠాన్ని నిర్మించారు. మఠాన్ని పరిశీలించినట్లయితే క్రైస్తవ మత ప్రచారకుల జీవన విధానం, యాత్రికుల నివాస విధానం కూడా అవగతమవుతుంది. క్రీ.శ.1204లో ఈ మఠం జీర్ణదశకు చేరుకుంది. ఫ్రెంచ్ రాజైన ఫిలిప్ దీన్ని పునర్నిర్మించారు. గోతిక్ శిల్ప శైలిలో పునర్నిర్మించిన ఈ మఠం క్రీ.శ.1228లో పూర్తి చేసారు. ఇక్కడ మఠం నిర్మిస్తున్న సమయంలో అనేకమంది ఆర్థికంగా చేయూతనిచ్చారు. ప్రస్తుతం ఈ మఠం అనేకమంది మేధావులకు నిలయంగా మారింది.



### పర్వతంపై రహదారి

ఈ పర్వత ప్రాంతాన్ని 1873లో ప్రకృతి సంపదగా గుర్తించారు. 1966లో బెనెడిక్ట్స్ సంఘం ఇక్కడికి చేరుకుంది. ఒకప్పుడు తుపానులు వచ్చినప్పుడు ఉవ్వెత్తున ఎగసిపడే అలల వల్ల నీటి తాకిడి అధికంగా ఉండేది. కానీ ఇక్కడ ఒక గట్టు నిర్మించడంతో ఈ కొండ వరద తాకిడి నుండి బయట పడింది. సముద్రంలో ఆటుపోటులు వచ్చినప్పుడు ఈ ప్రాంతం పలు రకాలుగా

కనిపిస్తుంది. అటు వచ్చినప్పుడు ఈ ద్వీపం చుట్టూ నీరు అనేది కనిపించదు. పోటు వచ్చినప్పుడు సముద్రజలాలు ఈ గుట్టను చుట్టేయడంతో ద్వీపంలా కనిపిస్తుంది. ద్వీపంలా మారినప్పుడు దీని అందం ద్విగుణీకృతమౌతుంది. ఈ ప్రదేశం తీర ప్రాంతంలో ఉండటం వల్ల విపరీతంగా గాలి వీస్తుంది. చిన్నపాటి కొండలా కనిపించే ఈ గుట్టకు చేరుకోవడానికి వంతెనను 1879లో నిర్మించారు. జెరూసలేంకు చెందిన మోనాస్టిక్స్ 2006లో ఇక్కడికి చేరుకుని శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. మధ్య యుగాలలో ఈ పర్వతం పైకి 'గ్రాండ్ రూ' అనే పేరుతో ఒక రహదారిని నిర్మించారు. ఆ సమయంలోనే రహదారి పక్క వ్యాపార సముదాయాలు కూడా ఆవిర్భవించాయి. ఆ కాలంలో ఈ ప్రాంత మత విశ్వాసులకు ఉపయోగపడగా ఇప్పుడు పర్యాటకులకు ఉపయోగపడుతుంది. క్రీ.శ.1204లో ఇక్కడి రోమన్ మఠాన్ని కొందరు నాశనం చేశారు. ఆ తరువాత ఫ్రెంచ్ రాజైన ఫిలిప్ అగస్టే ఈ మఠాన్ని పునర్నిర్మించారు. గోతిక్ నిర్మాణ శైలిలో ఈ మఠాన్ని క్రీ.శ.1228లో పూర్తి చేశారు. క్రీ.శ.1337 నుండి 1453 మధ్య కాలంలో జరిగిన యుద్ధంలో ఇంగ్లండ్, ఫ్రెంచ్‌వారు ఈ ప్రాంతాన్ని బలమైన స్థావరంగా ఉపయోగించుకున్నారు. ఆ తరువాత ఈ ప్రాంత ప్రాముఖ్యం కొంతమేర తగ్గింది. ఫ్రెంచ్ విప్లవం తరువాత ఈ ప్రదేశాన్ని కారాగారంగా ఉపయోగించారు. 13వ శతాబ్దంలో జరిగిన అగ్ని ప్రమాదంలో చర్చి ముందుభాగం కొంత దెబ్బ తింది. ఆ తరువాత దీన్ని గోతిక్ శైలిలో పునర్నిర్మించారు. క్రీ.శ.1873లో ఈ కొండ మొత్తాన్ని ప్రకృతి సంపదగా గుర్తించారు. 1979లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వం కట్టడంగా ప్రకటించారు. అనేక సందర్భాలలో తుపాన్‌లు వచ్చినప్పుడు సముద్రపు అలలు 14 మీటర్ల ఎత్తు వరకు ఎగసి పడ్డాయి. ఆ సమయాలలో వరదల తాకిడిని కూడా ఈ ప్రార్థనా మందిరం ఎదుర్కొంది. ఇటువంటి వాటిని అరికట్టి సెయింట్ మైఖేల్ ప్రార్థనా మందిరాన్ని పరిరక్షించే నేపథ్యంలో క్రీ.శ.1880లో సముద్రపు వరద తాకిడిని తగ్గించేందుకు ఇక్కడ ఒక గట్టును నిర్మించారు. చర్చి ప్రాంగణంలో ఒక తోట ఉంది.





చర్చిలోని స్తంభాలు, శిల్పకళ పరమాద్భుతంగా ఉంటాయి. ఇక్కడే మధ్య యుగ మేరీ, ఏసు శిల్పాలు కానవస్తాయి. చర్చి పై భాగానికి చేరుకోవాలంటే కాలి నడక వెళ్ళాలి. పాత కాలపు కోట ద్వారం స్వాగతం పలుకుతూ కనిపిస్తుంది. అప్పుడు అనేక చలన చిత్రాలను ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని 'సామజవరగమన' అనే పాటలో కొంత భాగాన్ని ఈ చర్చి ఎదురుగా చిత్రీకరించారు. ఇక్కడ బస చేయడానికి హోటళ్లు ఉన్నాయి. షాపింగ్ ప్రియులను ఇక్కడి దుకాణాలు పలకరిస్తాయి. చర్చి పై భాగం నుండి తిలకిస్తే ప్రకృతి అందాలు ద్విగుణీకృతంగా కనిపిస్తాయి. మైఖేల్ ప్రార్థనా స్థలం నుండి ఉదయంపూట సూర్యోదయం పరమాద్భుతంగా కనిపిస్తుంది. నేడు ఈ ప్రదేశంలో అనేకమంది స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఫ్రాన్స్‌లో ఈఫిల్ టవర్ తరువాత అత్యధిక మంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారని అంచనా. ❐







# భూతాపం భవితకు శాపం

కవర్ స్టోరీ

**తండ సదానందం**

**జీ**వితం సాధ్యమయ్యే ఏకైక గ్రహం భూమి.. మానవ జీవితంతో పెనుబంధం వేసుకున్న మట్టి మృత్యు కోరల్లో చిక్కుకున్నది. అభివృద్ధి పేరిట మానవుడు విధ్వంసకర అభివృద్ధికి పాల్పడుతూ మట్టికి జీవం లేకుండా, భూసారం కోల్పోయి లవణీయత పెరిగి భవిష్యత్ తరాలకు మట్టి అనుబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా మానవాళి కార్యక్రమాలు మట్టిని ప్రమాదకరంలో పడవేయడం జరిగింది.

> జీవితాలకు
> మద్దతు ఇచ్చేది మట్టి,
> భూమిని సజీవంగా ఉంచేది మట్టి,
> జీవుల నివాసానికి నీడనిచ్చేది మట్టి,
> సుస్థిర జీవితానికి వాతావరణానికి దారి
> తీసేది మట్టి, జీవుల మనుగడకు
> అనువైనది మట్టి
> పుట్టేది గిట్టేది మట్టిలోనే..

తరతరాల నుండి తాత ముత్తాతల కాలం నుండి అనుసరించిన సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అమలులో లేవు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో అభివృద్ధిని సాధించి చంద్ర మండలానికి, అరుణ గ్రహానికి ఎగబాకుతూ వందలాది ఉపగ్రహాలను ప్రవేశపెట్టి, వాటి నుండి అద్భుత ఫలితాలను సాధించినప్పటికీ చిటికెడు మట్టిని తయారు చేయడం సాధ్యం కాదు. ప్రకృతి నుంచి మనిషి దేనినైనా సృష్టించగలడు. ప్రకృతిని విస్తరించాలి. ప్రకృతిని కాపాడుకోవాలి. అందులో భాగంగానే మట్టిని రక్షించుకోవాలి. మట్టిని రక్షిస్తేనే మనిషి రక్షింపబడతాడు. మనిషి టెస్ట్ ట్యూబ్ బేబీలను, ఒకే పోలిక ఆకారంతో గల జీవులను సైతం క్లోనింగ్ ప్రక్రియతో సృష్టించగలిగినా మట్టిని నేలను మాత్రం సృష్టించలేదు. ఇంతవరకు ఆ దిశగా ప్రయత్నాలు జరిగినట్లు లేదు. వైరస్‌లను ఎదుర్కోవడానికి వ్యాక్సిన్ కోసం పరుగులు పెడుతున్నాడు కానీ నేలను రక్షించుకోవడానికి సృష్టించడానికి ప్రయత్నం చేయడం లేదు. వాతావరణ మార్పు, కర్బన ఉద్గారాలు, వాయు కాలుష్యం, నీటి కొరత, ఆహారపు కొరత వంటి పదాలు చాలా మందికి సుపరిచితమే. కానీ అతి తక్కువ మంది మాత్రమే మట్టిపై దృష్టి పెట్టారు. వేలాది సంవత్సరాలుగా భూమిపై జీవం భూమి క్రస్ట్‌పై సారవంతమైన ఫలితం మట్టి పొర ద్వారా సాగుతుంది. ప్రపంచంలో నేల 29 శాతం మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నేల ద్వారానే 750 కోట్ల ప్రజలు తమ జీవనాన్ని గడుపుతున్నారు. ప్రకృతికి వ్యతిరేకంగా పయనిస్తున్న మానవ అభివృద్ధి కార్యక్రమాలు ఈ మాత్రం నేలను కూడా అందుబాటులో లేకుండా ఉంచకపోవడానికి కారణాలవుతున్నాయి. శరవేగంగా ముంచుకొస్తున్న వాతావరణం మార్పులు భూగోళం మీద సమస్త ప్రాణికోటికి మరణ శాసనం రాస్తున్నాయి. భూగ్రహంలో నేలకు మట్టికి ఎంతో ప్రాధాన్యం ఉంది. పట్టణీకరణ అడవుల నరికివేత, వ్యవసాయం కారణంగా మట్టికోతకు గురి అవుతూ, లవణీయత పెరిగి నాణ్యత తగ్గుతుంది. ఈ క్రమంలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గి ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని వివిధ రకాల అధ్యయనాలు తెలియజేస్తున్న క్రమంలో మట్టిని రక్షించుకోవడానికి ప్రతి సంవత్సరం డిసెంబరు 5న ప్రపంచ మట్టి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

**ప్రపంచ నేల లేదా మట్టి దినోత్సవం**

ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ 2002లో డిసెంబరు 5ని ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించాలని ప్రతిపాదించింది.

ఈ రోజు మన పర్యావరణ వ్యవస్థలో నేల ప్రాముఖ్యతను, నేల విధ్వంసం కలిగించే క్లిష్టమైన ప్రభావాలను సూచిస్తుంది. థాయిలాండ్ రాజు హెచ్ఎం కింగ్ భూమి బోల్ అధుల్యా దేజ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈవెంట్ జరుపుకోవడానికి ఎంపిక చేయడం జరిగింది. అతను ప్రపంచ నేల దినోత్సవం ఏర్పాటుకు క్రియాశీలక పాత్ర పోషించారు. డిసెంబరు 2013, 68వ ఐక్యరాజ్యసమితి అసెంబ్లీలో డిసెంబరు 5న అధికారికంగా ప్రపంచ నేల దినోత్సవం ప్రకటించారు. ఆ తర్వాత 2014 డిసెంబరు 5 నుండి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించబడుతుంది.

### ముఖ్య లక్ష్యం

మట్టి ప్రాముఖ్యత గురించి ప్రచారం చేసిన, దానిని రక్షించడానికి ఎటువంటి ప్రయత్నాలు జరగలేదు. నేలలు నాసిరకం వనరులుగా తయారవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మట్టిని కాపాడుకోవడంతో ప్రజలు, ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మట్టి క్షీణతను గుర్తించడం సులభం కాదు. ఇతర సహజ వనరుల మాదిరిగా క్షీణించడాన్ని అర్థం చేసుకోలేం. ఇది ఒక నిదానమైన నిశ్శబ్ద ప్రక్రియ. ఇది చాలా సమయాన్ని తీసుకుంటుంది. కానీ ప్రభావం వినాశకరంగా ఉంటుంది. అజాగ్రత్త నిర్లక్ష్యం కారణంగా ఎకరాల భూమి నాశనం, నష్టానికి గురి కావచ్చు. ప్రపంచ మట్టి దినోత్సవం ప్రపంచ దృష్టిని ఆకర్షించి ప్రభావాలని ప్రతి ఒక్కరికి తెలియజేసి చైతన్యపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. మట్టి లేకుండా మొక్కలు పెరగడానికి స్థలం లేనందున పెరుగుతున్న జనాభాకు ఆహారం అందదు. ప్రపంచ మట్టి దినోత్సవం స్థిరత్వంతో పాటు నేల నిర్వహణకు గుర్తింపు, మద్దతుని కోరుతుంది. ఇది నేల సరైన నిర్వహణ, సంరక్షణను లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబరు 5, 2014లో మొట్టమొదట అధికారిక ప్రపంచం మట్టి దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మట్టి నిపుణులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఇటలీలోని రోమ్‌లో ఉన్న ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యాలయంలో ఒక సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా ఎఫ్.ఏ.ఓ. సచివాలయం ఆహార భద్రత, ఆకలి నిర్మూలన, వాతావరణం మార్పుల అనుసరణ పేదరికం తగ్గింపు, సుస్థిర అభివృద్ధికి ప్రయత్నాలకు ప్రపంచ మట్టి దినోత్సవం దోహదపడగలదని ప్రకటించింది. ఈరోజు నుండి ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ప్రజలను చైతన్యపరచడానికి అవగాహన కల్పించడానికి ఎజెండాగా పెట్టుకుంది. మరుసటి సంవత్సరం 2015 నేల సమాజానికి చాలా ముఖ్యమైన సంవత్సరం. 2017 ప్రపంచ దినోత్సవం థీమ్ "ఆరోగ్యకరమైన జీవితానికి ఆరోగ్యకరమైన నేలలు" అని ప్రకటించి ఆహార భద్రత కోసం నేల ప్రాముఖ్యత, అది నిర్వహించే కీలకమైన ప్రక్రియలపై విస్తృత ప్రచారం చేయడం జరిగింది. ఇది జీవ వైవిధ్యం, నీటి



నష్టం ముఖ్యంగా మొక్కల నష్టాన్ని నివారిస్తుంది. ఈ సంవత్సరం ఈ దితన్స్వ వేడుకలు 60 వేల మందికి పైగా శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అదే విధంగా 2017 ప్రపంచ నేల దినోత్స వం సందర్భంగా న్యూయార్క్, నైరోబీ, రోమ్‌లతో పాటు శాంటియాగో, మాస్కోలో అధికార వేడుకలు "నేల సంరక్షణ భూమి నుండి ప్రారంభమవు తుంది" అనే థీమ్‌తో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. దీంతో పాటు అదనంగా గ్లోబల్ సాయిల్ ఆర్గానిక్ కార్బన్ మ్యాప్, నేల కాలుష్య నిర్వహణపై యుఎన్ఈఎ3 తీర్మానాన్ని 177 దేశాలు ఆమోదించాయి. 2020లో "నేలను సజీవంగా ఉంచండి, నేల జీవవైవిధ్యాన్ని రక్షించండి" అనే థీమ్ 105 దేశాలలో 780 సంఘటనలతో ప్రపంచ మట్టి దినోత్సవం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. 2021లో నేల లవణీత ప్రమాదాలను ఎత్తిచూపడం ద్వారా ఆరోగ్యరమైన పర్యావరణ వ్యవస్థలను, మానవ శ్రేయస్సును నిర్వహించడం గురించి అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశంగా "మట్టి లవణీకరణను నిలిపివేయండి. నేల ఉత్పాదకత పెంచండి" అనే థీమ్‌తో ముందుకు వచ్చింది. నేలను ఆరోగ్యంగా ఉంచడం గురించి ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంఘాలను ప్రేరేపించడం లక్ష్యంగా జరుపుకోవడం జరిగింది. ఈ సంవత్సరం 2022లో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా నేల పోషకాల నష్టం నేల క్షీణతకు ఒక ముఖ్యమైన కారణం, ఆహార భద్రత స్థిరత్వానికి ప్రధాన అంతర్జాతీయ సమస్యగా ఉన్నందున నేలల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రజలను ప్రోత్సహించడానికి ఆరోగ్యరమైన పర్యావరణ వ్యవస్థలు, మానవ శ్రేయస్సును పెంపొందించడానికి అందరిలో నేలపై అవగాహన కల్పించేందుకు "నేలల ఆహారం ఎక్కడ ప్రారంభం అవుతుంది" అనే థీమ్‌తో ముందుకు రాబోతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సంస్థలతో పాటు, సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రారంభించిన 'మట్టిని రక్షించు' అనే ప్రపంచ ఉద్యమంతో పాటు మట్టి ఆరోగ్యాన్ని పునరుద్ధరించే ఏకైక లక్ష్యం కోసం వేలాది మంది ప్రముఖ వ్యక్తులు, సంస్థలు ఏకమవుతున్నాయి. మట్టి ధ్వంసం కాకుండా ఇంతటి తీవ్ర ప్రయత్నాలు చేయడానికి కారణం ఏమిటి? మట్టి ఎవరికి ముఖ్యం, మట్టి లేకపోతే ఏమవుతుంది? మట్టిని ఎందుకు రక్షించాలి? దాని ప్రాముఖ్యతను చర్చించుకుందాం..



మట్టి మనందరికీ ముఖ్యం, రైతన్నకు అతి ముఖ్యం. మట్టితోనే తన జీవనయానం బతుకుపోరు సాగుతుంది. మట్టిని పెకలించి దాని పొత్తిళ్ల నుండి పంటలను తీసి మన ఆకలి తీర్చేది ఆకుపచ్చ చందమామ. మట్టి లేకపోతే మనిషి లేడు, మట్టి లేని మనిషి మృత్యువుతో సమానం. మట్టి మనిషి బలం, జీవధాతువు. భూమి మీద కనీసం 40 శాతం అడవులు ఉండాలి. కానీ ఒక అంచనా ప్రకారం 13 శాతం మాత్రమే ఉన్నాయి. అంటే మరో ముప్పై ఏళ్లు పోతే భూమి మీద వర్షం పరిస్థితులు కానరావు. మట్టి నీటిని తీసుకుని మేఘాలకు అందించాలి. మేఘాలు చల్లబడి చెట్ల చేత ఆకర్షింపబడి వర్షింపబడతాయి. ఈ వర్షచక్రానికి విఘాతం కలుగుతుంది. మట్టి ఉంటేనే చెట్లు, చెట్లు ఉంటేనే వాన, వానలు కురిస్తేనే మానవ మనుగడ సాధ్యం అవుతుంది.

### మట్టి ఎలా నశిస్తుంది?

మట్టి నుంచి సహజంగా వచ్చేది ఏదైనా మట్టిలోనే కలిసిపోతుంది. కానీ మట్టికి ఆమోదం లేని పద్ధతిలో మనిషి తయారు చేసే రసాయనిక సమ్మేళనాలతో కూడిన పదార్థాలను తనలో ఇనుమడింపచేసుకోకుండా నిరాకరిస్తుంది. ప్లాస్టిక్, కెమికల్, పారిశ్రామిక వ్యర్థాలు, ఔషధ పరిశ్రమల విసర్జనల వంటి వాటిని మట్టిలోనే వదులుతుండడంతో ఈ విష పదార్థాలకు మట్టి విషపూరితమై మెల్లమెల్లగా మరణిస్తుంది. గత 25 ఏళ్లలో భారతదేశం సజీవ మృత్తికను అంటే మొలకెత్తే మట్టిని దాదాపు 38 శాతం కోల్పోయింది. అంటే పంటకు పనికి రాకుండా మృత భూమిగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా 52 శాతం వ్యవసాయ భూములు ఇప్పటికే నిస్సారమయ్యాయి. సేంద్రియ పదార్థాలు లేకుండా మట్టి ఇసుకగా మారుతుంది. మట్టి నశించడం వల్ల భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మట్టి నశించడం వల్ల మానవాళి పెను సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే కొనసాగితే జీవన అంతానికి నాంది అవుతుంది. అది ఎలాగో తెలుసుకుందాం.

### ఆహార సంక్షోభం

సారం లేని మట్టి పోషక విలువలు లేని ఆహారాన్ని ఉత్పత్తి చేయడమే కాకుండా ఆహార కొరతను కూడా సృష్టిస్తుంది. 20 సంవత్సరాలలో 930 కోట్ల మంది ప్రజలు ఉండగా ఆహారం మాత్రం 40 శాతం తక్కువ ఉత్పత్తి అవుతుందని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేశాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన ఆహార సంక్షోభ మూలంగా ఆకలి విజృంభిస్తుంది. చిన్న చిన్న దేశాలతో పాటు ఆహార ఉత్పత్తుల ఎగుమతి చేసే దేశాలతో సహా ఆహార సంక్షోభం ప్రబలంగా ఉంది. మట్టి సంరక్షణ లేకపోవడం మూలంగా వ్యవసాయం పంటల మార్పిడి, కోతలు, ఆహార నిల్వలు అత్యంత ప్రభావానికి గురి అయ్యాయని ఐక్యరాజ్యమితి ఆహార వ్యవసాయ సంస్థ తన నివేదికలో తెలిపింది. 107 దేశాల్లో ఆహార సమస్య తీవ్రతరం కానున్నదని 2002 మార్చిలోనే ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజు 69 కోట్ల మంది ప్రజలు ఆకలితోనే



అలమటిస్తున్నారు. యూనిసెఫ్ అంచనా ప్రకారం 90 శాతం పిల్లలకు కనీస ఆహారం అందడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వెల్లడిస్తున్న ఆహార సంక్షోభ గణాంకాలను పరిశీలిస్తే ప్రతిరోజు 10,000 మంది చిన్నారులు ఆకలి కారణంగా ప్రాణాలు విడుస్తున్నారు. 200 కోట్ల మంది ప్రజలు అనేక రకాల వ్యాధులకు దారి తీసి పోషకాహార లోపాలతో బాధపడుతున్నారు. బలవర్ధకమైన భూమి దెబ్బతినడం వల్ల, పంటలు నాసికరంగా, పండ్లు, కూరగాయలతో పోషకాలు 90 శాతం మేరకు తగ్గిపోతున్నాయి.

### నీటికొరత

కాలుష్యం వల్ల క్షీణించిన మట్టినీటిని గ్రహించలేదు, ప్రవాహాన్ని



నియంత్రించలేదు. నీటి నిలువుదల లేకపోవడం మూలంగా కరువులు, వరదలు, నీటికొరత సమస్యలకు దారితీస్తుంది. మట్టిలో సేంద్రియ పదార్థం ఉంటే దాని బరువులో 90 శాతం వరకు నీటిని ఒడిసి పట్టుకోగలదు. కాలక్రమేణా నెమ్మదిగా వాటిని విడుదల చేస్తుంది. కరువు పీడిత ప్రాంతాలకు ఇది దోహదపడుతుంది. కానీ వాతావరణ మార్పులు కాలుష్య ప్రభావంతో మట్టి కలుషితమై సేంద్రియ పదార్థాలు నశించడం వల్ల భవిష్యత్తులో తాగునీరు, సాగునీరు లభ్యమయ్యే పరిస్థితులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

### జీవవైవిధ్యంలో నష్టం

పారిశ్రామిక విధానాలు, అభివృద్ధి పేరిట ప్రమాదకర విషవాయువులను విడుదల చేసే పరిశ్రమలను నెలకొల్పడం, ప్రకృతిలో విహరించే జంతుజాల ఆవాసాలను ధ్వంసం చేయడం వల్ల ప్రతి సంవత్సరం దాదాపు 27 వేల రకాల జీవులు అంతరించిపోతున్నాయని శాస్త్రవేత్తలు వాపోతున్నారు. అడవుల నరికివేత, వ్యవసాయంలో మితిమీరిన రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలో పోషక విలువలను పెంచే సూక్ష్మజీవులు, పక్షులు మొదలైనటువంటి ఇతర ప్రాణులు క్రమక్రమంగా అంతరించిపోవడం వల్ల జీవ వైవిధ్యానికి నష్టం ఏర్పడుతుంది. 80 శాతం పురుగుల జీవ పదార్థం నశించిపోయే స్థాయికి సంక్షోభం చేరుకుంది. జీవ వైవిధ్యం కోల్పోవడం వల్ల నేల ఆవాసాలకు అంతరాయం ఏర్పడి మట్టి పునర్జీవనాన్ని నివారిస్తుంది.

### వాతావరణం మార్పు

ప్రపంచ వ్యాప్తంగా మట్టిని పునరుజ్జీవింప చేయకపోతే అది వాతావరణ మార్పులకు సహాయపడే 850 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ను వాతావరణంలోకి

ఇది గత 30 సంవత్సరాలలో మానవాళి మొత్తం విడుదల చేసిన ఉద్గారాల కంటే ఎక్కువ. మట్టిలో కార్బన్ మొక్కలకంటే 3 రెట్లు, వాతావరణం కంటే 2 రెట్లు ఎక్కువగా నిల్వ ఉంటుంది. దీనిని బట్టి కార్బన్‌ను గ్రహించడానికి మట్టి ఎంతో కీలకం అని తెలుస్తుంది.

**జీవనోపాధి కోల్పోవడం**

భూమిపై నివసిస్తున్న జాతుల సంఖ్యను గురించిన వివిధ అంచనాల ఆధారంగా ప్రతి సంవత్సరం 200 నుండి 1,00,000 జాతులను కోల్పోవడం జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా భూమి క్షీణత వల్ల 74 శాతం మంది పేదలు ప్రత్యక్షంగా ప్రభావితం అవుతున్నారు. కొవిడ్ సంక్షోభం ఉపాధి ఉద్యోగాలను దూరం చేయగా క్షీణిస్తున్న మట్టి వల్ల మట్టిని నమ్ముకుని, మట్టిలోనే నివసిస్తూ, మట్టితోనే మనుగడ కొనసాగిస్తున్న వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతిరోజు రైతు ఆత్మహత్యలకు సంబంధించిన వార్తలు లేని దినపత్రిక ఉండదు. హరిత విప్లవం తర్వాత వ్యవసాయ రంగంలో యంత్రాల వాడకం వల్ల, ప్రచ్ఛన్న నిరుద్యోగం తీవ్రతరమైంది. భూసారం తగ్గడం వల్ల నాణ్యతలేని పంటలు పండడం వల్ల, అస్పష్టమైన ప్రభుత్వ విధానాల వల్ల భూసార పరీక్షలు నిర్వహించి వ్యవసాయ సాగు భూములలో మట్టిలో ఉండే పోషక విలువలను బట్టి ఏఏ పంటలు పండించాలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వల్ల పెట్టుబడి అధికమైన అప్పుల ఊబిలో కూరుకుపోయి బలవన్మరణాలకు పాల్పడటం విచారకరం. మట్టి వినాశనం అవ్వడం వల్ల ప్రపంచానికి ప్రతి ఏటా 10.6 ట్రిలియండ్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

వలస పోవడం

జనాభా పెరుగుదల ఆహారం నీటి కొరత కారణంగా 2050 నాటికి 100 కోట్ల మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. 1990 నుండి ఆఫ్రికాలో జరిగిన 90 శాతం పైగా ప్రధానంగా యుద్ధాలు ఇంకా అనేక ఘర్షణలలో భూమి సమస్యలు ముఖ్యమైన పాత్ర వహించాయి. మట్టి క్షీణించడం వల్ల వ్యవసాయ రంగం నష్టాల బాటలో ఉండడం వల్ల, వ్యవసాయం లాభసాటిగా లేని చిన్నా సన్నకారు రైతులు పట్టణాలకు వలస వెళ్తూ పట్టణీకరణకు కారకులుగా మిగిలపోతున్నారు.

ఇలా ప్రతి ప్రధాన పర్యావరణ సంక్షోభం కొంతవరకు లేదా ఏదో ఒక రూపంలో మట్టి క్షీణత లక్షణం ఒక పరిణామం.. అంతేకాకుండా ప్రపంచంలోని భూమిపై ఉన్న 8 బిలియన్ల మందిలో దాదాపు 10 శాతం మంది ఇష్టపికే 3 బిలియన్ల ఆరోగ్యకరమైన ఆహారం లభించక పోషకాహార లోపంతో ఉన్నారు. భూమి, నీటి వనరులు ప్రమాదకర స్థితిలోకి చేరుకొని రైతులను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. వాతావరణ ఒత్తిడి, కాలుష్యంతో క్షీణించిన వ్యవసాయం, వ్యవసాయ వ్యవస్థ 2050 నాటికి అదనంగా 2 బిలియన్ల మందికి ఆహారం



ఇవ్వడానికి స్థిరమైన పద్ధతులకు త్వరగా మారాలని ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ నివేదిక చెబుతుంది. ప్రస్తుతానికి రైతులు ఎక్కువగా భూమికి సాగునీరు అందించడం, ఎరువులు పురుగు మందులను అధిక మోతాదులో ఉపయోగించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచగలిగిన, ఇవి స్థిరమైన పద్ధతులు కావు. నీటి సరఫరా కాలుష్యం చేయడం, క్షీణించడం ప్రపంచ అడవులను కుదించడం ద్వారా అవి నేలను క్షీణింపచేశాయి. వాతావరణ మార్పు ప్రపంచ వ్యవసాయ వ్యవస్థలను ఒత్తిడికి గురి చేస్తుందని, ప్రపంచ ఆహార ఉత్పత్తి సవాళ్లను వివరిస్తున్నదని నివేదిక స్పష్టం చేసింది. స్మార్ట్ ప్లానింగ్, స్థిరమైన వ్యవసాయ పద్ధతుల సమన్వయంతో కొత్త వినూత్న సాంకేతిక పద్ధతులను వినియోగించడం ద్వారా నీటి క్షీణతను అధిగమించవచ్చు. స్థిరమైన వ్యవసాయం వాతావరణ మార్పులతో పోరాడుతుంది. నేలను జాగ్రత్తగా తెలివిగా ఉపయోగించడం ద్వారా ప్రస్తుతం వ్యవసాయ కార్యకలాపాల వల్ల విడుదల అయ్యే గ్రీన్ హౌస్ వాయువులను కట్టడి చేయవచ్చు. వాతావరణంలో తీవ్రమైన మార్పులకు వారు పండించే పంటలను సర్దుబాటు చేయడానికి ప్రాంతాలు అవసరం. చాలా తృణధాన్యాల ఉత్పత్తి ఉత్తరం, కెనడా, ఉత్తర యురేసియాకు తరలించవలసి ఉంటుందని నివేదిక అంచనా. మార్పులు అంత సులభం కాదు, కానీ విస్తృతమైన ఆకలి, ఇతర విపత్తులను నివారించడానికి అది అవసరం కావచ్చు. గత 20 సంవత్సరాలలో ప్రపంచ జనాభా కేవలం 6 బిలియన్ల నుండి దాదాపు 8 బిలియన్ల మందికి 25 శాతం కంటే ఎక్కువ పెరిగింది. ఎకరం వ్యవసాయ భూమికి ఉత్పాదకత స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు ఆహారం కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చగలిగారు. కాబట్టి ఆ సమయంలో పంటలు పండించడానికి ఉపయోగించే భూమి పరిమాణం కేవలం 4 శాతం పెరిగింది. డీజిల్, ఇంధన యంత్రాలు ఎరువులు, పురుగుల మందులు వినియోగాన్ని పెంచడం ద్వారా సాధ్యపడింది. దిగుబడిని పెంచడానికి లేదా నిలబెట్టుకోవడానికి ఆ కర్బన ఎరువులతో నేలల చికిత్స, నేల ఆరోగ్యంపై గణనీయమైన ప్రతికూల ప్రభావం చూపి రన్ ఆఫ్, డ్రైనేజి ద్వారా మంచినీటి కాలుష్యానికి దోహదం చేస్తుంది. ఈ క్షీణత వ్యవసాయ భూములలో విస్తృతంగా ఉంది.

నీటిపారుదల ఆహార డిమాండ్లు తీర్చడానికి కీలకం. ఎందుకంటే వర్షాధార వ్యవసాయ భూమి కంటే ఎకరాకు రెండు నుండి మూడు రెట్లు ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తుంది. నీటిపారుదల, ఎరువులు, పురుగు మందుల ప్రవాహాన్ని పెంచుతుంది.

ఇది నేలను భూగర్భ జలాలను కలుషితం చేస్తుంది.

ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఎఫ్.ఏ.ఓ నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉపరితల, భూగర్భ జలాల ఉపసంహారణలలో వ్యవసాయం 72 శాతం వాటాను కలిగి ఉంది. ప్రధానంగా నీటి పారుదల కోసం అనేక భూగర్భ జలాశయాలు క్షీణిస్తున్నాయి. నీటిపారుదల వ్యవసాయం కోసం గ్లోబల్ భూగర్భ జలాలు గత దశాబ్దంలో దాదాపు 20 శాతం పెరిగాయి.

**(మిగతా 27వ పేజీలో)**

# ఈ వారం కవిత్వం

# అలికిడి



**పుల్ల** ఐసు బాల్యపు తీపి
తగ్గదు గాక తగ్గదు
చేదు భాగం క్రమక్రమంగా కరగకమానదు
కరిగింది మంచుగడ్డ కాలమేగానీ
మనసు క్షేత్రంలో గట్టిగనే నిక్షిప్తమైంది
రాతి సమయపు పొరల్లో జల అలికిడి
జ్ఞాపకాల ఊటబావి
అనుమానం లేదు సప్త సముద్రాలను మించింది
తప్పో ఒప్పో నాటి క్షణాలు కొన్ని
తనతో బాటే వెంటబెట్టుకెళ్ళినా
ఇంకొన్ని చిటికెన వేలు నొదలకుండె
సరిదిద్దుకుంటానికి కాలాన్ని
గడియారపు ఫ్రేముల్లో బంధించి
ముళ్ళను సవరించలేం.
వివేకపు బెత్తాన్ని పట్టుకొని
నడక నడకనూ అదిలించలేం
రాలిన ప్రతి అనుభవ పత్రం
మట్టిలో కలిసినా,
అవసరమైనపుడు ఊహల తోటకు
కళాత్మకతను జోడిస్తుంది
జీవన సగ భాగం
తోడుకోవడంలో ప్రముఖ పాత్ర తనదే ఔతుంది.

**- వనిపాకల లచ్చిరెడ్డి**

---

# మనసు




మనసు చిట్టడవి అయింది
అక్షరాల పదాలు హృది
నుండి పారిపోయి
అడవిలో చిక్కుబడిపోయాయి
ఏ గుబురులో దాగున్నాయో!
ఏ చెట్టు ఎక్కి కూర్చున్నాయో!
భౌతికపరమైన వికారాల
ముళ్ళకంపలో చిక్కుకుపోయాయా!
నా అశ్రద్ధకి గుర్రై అలమటించి
సరైన పోషణ లేక
ప్రేమైక స్వరూపాలని వెతుక్కుంటూ
తామే వెళ్లిపోయాయేమో!
ఎక్కడని వెతకను?
ఎవరిని అడగను?
పుటలపై అందంగా
నడయాడే
నా పుత్రికలని మళ్లీ నేను
చూడగలనా?



అన్వేషణ చేస్తున్నా కానీ
కంటికి కానరావటం లేదు
ఓ వన్య ప్రాణులారా
నాపై దయ యుంచి
సుందర సుకుమార ముగ్ధ రూపాలైన
నా అక్షర పదాలను
వెతికి పట్టుకొని నాకు
తెచ్చి ఇవ్వరా?

**- పి.వి.యస్.కృష్ణకుమారి**

# గమ్యం కోసం



అడుగులు
తడబడుతున్నా
అపజయాలు
ఎదురవుతున్నా
కష్టాలు
కారుచీకట్లలా కమ్మేస్తున్నా
విశ్రమించని కృషీవలుడై
గెలుపు దారుల్లో
సాగిపోనివ్వాలి జీవితాన్ని
గమ్యం కోసం!
మనసును తాకిన
అవమానాన్ని
దేహాన్ని తాకిన
గాయాలని
కలలు కన్నా కలలని
కరిగిపోయిన కలలకి
గడిచిన గతాన్ని
గత జ్ఞాపకాలని
తలపోసుకొంటూ
తలసుకొంటూ..
ఆగిపోనివ్వకు జీవితాన్ని
సాగిపోనివ్వు జీవితాన్ని
గమ్యం కోసం!

**- లక్ష్మీ శ్రీనివాస్**



# నిశ్శబ్దంగా స్వప్నిస్తున్న చిత్రాడ

ఎటువంటి ఆర్భాటం, ప్రాచుర్యం లేకుండా నిశ్శబ్దంగా కవిత్వ ప్రస్థానం కొనసాగిస్తున్న కవి చిత్రాడ కిషోర్‌కుమార్. సౌమ్యుడు, సరళ హృదయుడు అయిన ఈ కవి స్వప్నమే కాదు యుద్ధం కూడా నిశ్శబ్దంగానే. 'నా ప్రయోగం నిశ్శబ్దం కావొచ్చుకానీ/ నా అక్షరాలు నిశ్శబ్దాన్ని ఛేదించే/ ప్రకంపనాలవుతాయి/ నా యుద్ధం నిశ్శబ్దం కావొచ్చుకానీ/ నా అక్షరాలు నిశ్శబ్దంగా యుద్ధం చేస్తూ/ ప్రపంచమంతా వ్యాపిస్తాయి' కొందరు చూడటానికి సామాన్యంగా, శాంతంగా కనిపిస్తారు. అక్షరాలు ముట్టుకుంటే వేళ్లు కాలిపోతాయి. 'స్పర్శ మాటలకందని మనోభాష! స్పర్శ భావోద్వేగమైన దేహభాష!' అంటున్న చిత్రాడ గొప్ప భావుకుడు. కుటుంబ బంధాలను పెనవేసుకుని పరవశించిపోతాడు. తన గారాబాల పట్టీ, గాయని యామిని గురించి ఏమంటున్నాడో చూడండి..'పదహారేళ్ల నిండిన నా చిట్టితల్లి పదహారణాల ఆడపిల్లలా/ నా ఎదుట శృతి చేస్తూ పాడుతుంటే/ నేను నిద్రపోయేటప్పుడు/ జోలపాడే అమ్మలా అమ్మవై కనిపిస్తుంటే/ మరిచేపోతాను మా(మీ) అమ్మ ప్రసవవేదన!' 'నిశ్శబ్ద యుద్ధం' సంపుటిలోని 74 కవితల్లో దేన్ని స్పృశించినా వస్తు వైవిధ్యంతో అలరారుతూ, కమ్మని అనుభూతుల్లో ముంచేస్తుంది.

**(నిశ్శబ్ద స్వప్నం, రచన: చిత్రాడ కిషోర్‌కుమార్, వెల: రూ 150, ప్రతులకు: ఎఫ్‌ఓఎఫ్, బ్లాక్-3, మహేశ్వరి టవర్స్, విజయవాడ)**

**- రమణ వెలమకన్ని**

# నటుడు చంద్రమోహన్ పరిచయం



సామాన్యులను మాన్యులను సమంగా ఆనందింప చేయగలిగే ప్రక్రియ సినిమా ఒక్కటే అని ఘంటా పదంగా చెప్పవచ్చును. అందరికీ అందుబాటులో ఉన్న వినోద పరిశ్రమ సినిమా. దేశంలో మూడవస్థానంలో ఉన్న తెలుగు చిత్రపరిశ్రమలో తెరముందు కనిపించే నటీనటవర్గానికి ఉన్నంత 'క్రేజు' ఇంతా, అంతాకాదు. నటనారంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన నటీనటుల గురించి పాఠకులు ఆసక్తితో చదువుతారు. తెలుసుకుంటారు. ప్రసిద్ధ తెలుగు నటుడు చంద్రమోహన్ (అసలుపేరు మల్లంపల్లి చంద్రశేఖరరావు) 23 మే 2022న 80 ఏళ్ల పూర్తి చేసుకున్నారు. 1966లో రంగులరాట్నంతో మొదలైన ప్రస్థానం 750పై చిలుకు చిత్రాలకు చేరింది. ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకుని వంశీఆర్ట్ థియేటర్స్ హైదరాబాదు వారు డా॥తెన్నేటి సుధాదేవి, జ్యోతివలబోజుల సంపాదకత్వంలో ప్రస్తుత సంకలనాన్ని అందిస్తున్నారు. పద్మశ్రీ కె.విశ్వనాథ్, భువనచంద్ర, రేలంగి నరసింహారావు ప్రభుతుల పరిచయ వాక్యాలు, భార్య జలంధర, కూతుళ్ల ఆత్మీయపు పరిచయాలున్నాయి. సహనటీనటులు, 112 గురుసాహితీవేత్తలు చంద్రమోహన్ నటించిన చిత్రాలపై సమగ్ర సమీక్షలు చేసారు.

**(తెలుగు సినీతెర చంద్రమోహనం, సంకలనకర్తలు: డా॥తెన్నేటి సుధాదేవి, జ్యోతివలబోజు, వెల: రూ 500, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

## పుస్తక సమీక్ష

డా॥ ముక్తేవి భారతి ఈ పుస్తకాన్ని చదువరులకు 'అభినందన' ద్వారా పరిచయ వాక్యాలు రాసారు. చాలా కథల్లో హాస్యం, వ్యంగ్యం, సందేశాత్మకత, ఆత్మీయత, కుటుంబచ్ఛాయలు కనిపిస్తాయి. ఈ సంపుటిలో 24 కథలున్నాయి. చిన్న గాంధీ, తప్పెవరిది, నిర్లక్ష్యం, స్వగతం, వానప్రస్థం, ఎవరికి చవక? టిన్..టిన్..టిన్-




# ఆలోచింపచేసే హాస్య కథలు

లాంటి కథలు రచయిత్రి కథనాన్ని తెల్పుతాయి. 'సన్మాన పత్రం' కథ చాలా బాగుంది. ఆఫీసులో రిటైరైన సుందరానికి సన్మానం అంతా చేస్తారు. సన్మాన పత్రం రాసే బాధ్యత కృష్ణ శాస్త్రికి రావడం, దాన్లో అందరి పేర్లు వచ్చేలా రాయమని సుందరరావు చెపుతూ నా రెండో భార్య పేరు రాయాలని కోరడం, పక్కనే వున్న బంట్రోతు వీరయ్య 'తాను పై నెలలో రిటైర్ అవుతాను సార్, తనకూ..' అంటూ అడగబోవటం, ప్రతివానికీ పొగుడుతూ రాయాలా నేను? ఛీ.. ఛీ.. అర్జెంటుగా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలి అనుకొంటూ బాధపడే కృష్ణశాస్త్రి కథనం బాగుంది. 'కరోనా' కాలాన్ని గుర్తు చేసే కథ 'దేవుడా నువ్వున్నావు' కథ. కరోనా కాలంలో షూటింగులు, సభలు, సెమినార్లు అన్నీ 'జూమ్' మీటింగ్‌లే! ఈ విషయాన్ని 'జూమాయణం' కథలో చక్కగా చెప్పారు ఈ కథలో. జూమ్ కార్యక్రమాల్లో కరెంట్ పోవడం, వినిపించక పోవడం, శబ్దాలు సరిగా వినబడకపోవడం, తెలుగు ఉచ్చారణ సరిగా లేని యాంకర్ సింగావి పాత్ర ఎంతో హాస్యాన్ని ఈ కథలో అందించారు. హాస్యకథలు ఆలోచింపే జేసేవిగా ఉన్నాయి. రచయిత్రి అభినందనీయురాలు. (మరో మాయా బజార్-రాధిక మంగిపూడి, వెల:రూ.150/-లు, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్) **- తంగిరాల చక్రవర్తి**

హేతువాద ఉద్యమకారుడు జె.వి.క్రిష్ణయ్య హేతువాదం వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా? అనే ప్రశ్నతో తన జీవన అనుభవాలను, ఆలోచనా భావజాలాన్ని పుస్తకంగా వెలువరించి, ప్రస్తుత చారిత్రకావసరాన్ని సమాజం చేత గుర్తింపు చేసే

# హేతువాదం-జె.వి.క్రిష్ణయ్య



మేల్కొలుపు బాధ్యత నిర్వర్తించారు. హేతువాదం నేటి మాటకాదు. శాస్త్రం ఎంత అధునాతన సాంకేతిక సంపన్నతతో ప్రపంచాన్ని నడిపిస్తున్నా దేశంలో మార్మిక వాదం, మతవాదం, కులవాదం, మౌఢ్యం పెరిగిపోతూనే వున్నాయి. శాస్త్రీయ దృక్పథం జనంలో అంకురించకుండా మేధావులు, విద్యాధికులు, ప్రభుత్వ నేతలు ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. జె.వి.కృష్ణయ్య భావపునరుజ్జీవనోద్యమం ద్వారా మేధావులు శాస్త్రజ్ఞులు, ఉపాధ్యాయులు, విద్యాధికులంతా మానవ వివేచనకు పదును పెట్టాలని, శాస్త్రీయ సమాజాన్ని నిర్మించడమే మనకు తక్షణ కర్తవ్యమని ప్రగాఢంగా కోరుతున్నారు. ఈ పుస్తకంలో హేతువాదం వలన కలిగే సామాజిక ప్రయోజనాలు, వ్యక్తిగత పురోగతికి ఏవిధంగా తోడ్పడుతుందో విశ్లేషిస్తూనే రచయిత, గాంధీ మనువాద, హిందుత్వ, మూర్ఖమత భావజాలాన్ని విమర్శించారు. మూఢత్వానికి మందు హేతువాదమని, కులం, మతం, దేవుడుపై కొరడా ఝళిపించిన జె.వి.కృష్ణయ్య అభినందనీయులు. **(హేతువాదం, రచన: జె.వి.క్రిష్ణయ్య, వెల: రూ 200, ప్రతులకు: జె.వి.క్రిష్ణయ్య, 86-276-2, బి.క్యాంప్, కర్నూలు)** **- ఎర్రమిల్లి**

ఈ ప్రపంచంలో అందమైన ప్రదేశాలకు కొరత లేదు. సుందరమైన ప్రకృతి, సుందరమైన డెజర్ట్‌లు, మంచు లోయలు, ద్వీపకల్పాలు, గొప్ప నిర్మాణ శైలి వంటి అనేక అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. బీచ్‌లు, విశాలమైన ఎడారులు, సుందరమైన లోయలు, మంత్రముగ్ధులను చేసే సరస్సులు, ఉల్లాసాన్ని ఇచ్చే ద్వీపాలను రోజుల తరబడి ఆస్వాదించినా తనవి తీరదు. అందమైన ప్రకృతి మనసుకు ఎంతో అహ్లాదాన్ని కలిగిస్తుంది. అందంగా



# అందంగా ఉన్నాయని ఈ ద్వీపాలకు వెళ్తే ఫసక్!

ఉన్న ప్రదేశాలు, ప్రాంతాలకు వెళితే మనసు తేలిక పడుతుందని భావిస్తాం. అయితే ఇటువంటి అందమైన ప్రదేశాల్లో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. అటువంటి వాటిలో కొన్ని అందమైన ద్వీపకల్పాలూ ఉన్నాయి. కొన్ని ప్రదేశాలు అందమైనవి మాత్రమే కాదు చాలా ప్రమాదకర మైనవి కూడా. అందం, అద్భుతంగా ఉండే ఇవి ప్రపంచం లోనే అత్యంత భయంకరమైనవిగా గుర్తింపు పొందాయి. అందంగా ఉన్నాయని ఈ ద్వీపాలలోకి వెళితే ఇక అక్కడ ఫసక్కే. వెళ్లిన వారు తిరిగి రాలేదంటే నమ్మగలరా? ఇప్పుడు అటువంటి వాటి గురించి తెలుసుకుందామా మరి.

## లూజోన్ ద్వీపం

ఫిలిప్పీన్స్‌లోని లూజోన్ ద్వీపం చూస్తే అద్భుతం అనిపిస్తుంది. లూజోన్ ఫిలిప్పీన్స్ సంస్కృతి మనోహరమైన ప్రపంచానికి ప్రవేశ ద్వారం. రమణీయ దృశ్యాలతో కనిపించే ఈ ద్వీపం దాదాపు 110 వేల చదరపు కిలోమీటర్ల ఉపరితల వైశాల్యం కలిగి ఉంది. ఈ ద్వీపంలో చదునైన భాగాలు ఉన్నాయి. ఉష్ణమండల అడవులు, వివిధ పర్వత శ్రేణులు ఉన్నాయి. ముఖ్యంగా సియోర్రా మాద్రే మడుగులు, వర్షారణ్యాలు పర్వతాల దగ్గర, ఎత్తైన శిఖరం దాదాపు మూడు వేల మీటర్ల ఎత్తు నుండి అనేక నదులు ప్రవహిస్తాయి. అయితే ఈ ద్వీపంలో రెండు అగ్ని పర్వతాలు ఉన్నాయి. అందులో ఒకటి టాల్ అగ్ని పర్వతం అనే ప్రమాదకరమైన,



చురుకైన అగ్నిపర్వతం ఇక్కడ ఉంది. ఇది 1991లో విస్ఫోటనం అయ్యేంత వరకూ చాలా కాలం పాటు నిద్రాణమై ఉంది. ఇది చాలా వినాశకరమైన అగ్ని పర్వతంగా గుర్తింపు పొందింది. దాని బిలంలో అగ్ని పర్వత సరస్సు ఉంది. దీనిని 'తాల్ సరస్సు' అని పిలుస్తారు. ఈ ద్వీపాన్ని చూడటానికి ప్రపంచం నలుమూలల నుండి ప్రజలు వస్తారు. ఇక్కడకు వెళ్లడం ప్రమాదం కానీ, అగ్ని పర్వతం విస్ఫోటనం అయినప్పుడు ఎవరికీ తెలియదు. ఎప్పుడు వస్తుందో ఎలా మీదకు ఉరుముతుందో అనేది ఊహించడం కూడా కష్టతరమే. అలాగే మరో తాల్ అగ్ని పర్వతం ఎల్లప్పుడూ చురుకుగా ఉంటుంది. ఈ అగ్ని పర్వతం 33 విస్ఫోటనాలను నమోదు చేసింది. అటువంటి ఈ ప్రాంతాలకు వెళ్లితే ఈ అగ్ని పర్వతం పేలినప్పుడు లావా ద్వీపం మొత్తం వెదజల్లి అక్కడకు వెళ్లిన వారు ప్రాణాలతో తిరిగి బయకు రావడం ఉండదు. భయంకరమైన శబ్దాలతో కన్ను మూసి తెరచే లోపుగా అక్కడకు వెళ్లినవారు లావాలో కొట్టుకుపోతారు. అప్పటి వరకూ అందంగా, కమనీయంగా, అద్భుతంగా కనిపించే ఆ ప్రదేశాలు భయంకర దృశ్యాలతో చూడటానికి లావా తప్ప ఇంకేమీ అగుపడవు.

## సీబుల్ ఐలాండ్

అంట్లాంటిక్ మహా సముద్రంలో ఉన్న ఈ ద్వీపాన్ని సిబుల్ ఐలాండ్ అని పిలుస్తారు. సిబుల్ ద్వీపం అనేది ఒక ఇరుకైన, చంద్రవంక ఆకారపు ఇసుక బార్ అని చెప్పవచ్చు.



దీని ఉపరితల వైశాల్యం 34 కిలోమీటర్లు కాగా, 43.15 కిలోమీటర్ల పొడవు ఉన్నప్పటికీ దాని విశాలమైన ప్రదేశంలో 1.5 కిలోమీటర్లు వెడల్పు మాత్రమే గల ఈ ద్వీపాన్ని ఐలాండ్ ఆఫ్ ఇసుక, శ్మశానవాటిక నది అని కూడా పిలుస్తారు. దీర్ఘ చంద్రవంక ఆకారంలో ఉన్న ఈ ద్వీపం నోవా స్కోటియాలోని హాలిఫాక్స్‌కు తూర్పున దాదాపు 285 కిలోమీటర్ల దూరం వరకూ ఉంటుంది. ఈ ప్రాంతంలో తరచుగా వచ్చే పొగ మంచు మరీ ముఖ్యంగా అకస్మిక బలమైన తుఫానులు చూపరులకు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. 300కు పైగా నౌకలు ఇక్కడ కూలిపోయి మునిగిపోయాయి. దీని వెనుక ఉన్న కారణం ఈ ద్వీపం దూరం నుండి సముద్రపు నీటిలా కనిపిస్తుంది. దీంతో చాలామంది మోసపోతారు. అధిక వేగం కారణంగా అవి ఇక్కడకు వచ్చి క్రాష్ అవుతాయి. సిబుల్ ద్వీపం పెద్ద సంఖ్యలో ఓడ ప్రమాదాలకు ప్రసిద్ధి చెందింది. ఈ ద్వీపంలోని ఇసుక కడ్డీలకు దాదాపు 400 నౌకల వరకూ బలి అయ్యాయని చెబుతారు. దట్టమైన పొగమంచు, ప్రమాదకరమైన ప్రవాహాలతో పాటు, ప్రధాన అట్లాంటిక్ షిప్పింగ్ మార్గం మధ్యలో ఉన్న ద్వీపం భయంకరమైన సంఘటనలకు కారణవుతున్నాయి.

### ఐసోలా డెల్లా గయోలా ద్వీపం

ఐసోలా డెల్లా గయోలా నేది నేపుల్స్ గల్ఫ్‌కు కొద్ది దూరంలో ఉన్న అందంగా ఏర్పడిన ఒక చిన్న ద్వీపం. ఇక్కడ రాతి తీరాలు పచ్చ జలాలచే కప్పబడి ఉన్నాయి. అద్భుతమైన విశాల దృశ్యాలను ఆస్వాదించడానికి ఇక్కడ విల్లా కూడా ఉంది. అయితే పర్యాటకులు, స్థానికులు ద్వీపం యొక్క శాపానికి బాధితులుగా మారతారనే భయంతో దాని దగ్గరకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఇటలీకి చెందిన ఐసోలా డెల్లా గయోలా



ద్వీపం శాపంగా పరిగణించబడుతుంది. నేపుల్స్ బేలో ఉన్న ఈ చిన్న ద్వీపం కథ చాలా భయంకరమైనది. దానిని కొన్న వ్యక్తి చనిపోతాడని లేదా అతనికి, అతని కుటుంబానికి ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని ప్రతీక. ఈ ద్వీపాన్ని కొనుగోలు చేసిన తర్వాత చాలా మంది యజమానులు ఇక్కడ మరణించారు. ఇప్పుడు ఈ ద్వీపం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంది. చాలా సంవత్సరాలుగా ఎడారిగా ఉంది. ఈ ద్వీపం వాస్తవానికి ఇరుకైన రాతి వంతెనతో అనుసంధానించబడిన రెండు ద్వీపాలను కలిగి ఉంది. 1911లో కెప్టెన్ గ్యాస్పేర్ అల్బెంగా తన ఓడను ద్వీపం చుట్టూ నడుపుతుండగా, దాని అందానికి అబ్బురపడి కొనాలని భావించిన వెంటనే అతను కిందికి దూకి మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఇలా వందలాది మంది ఈ ద్వీపంలో ప్రాణాలు కోల్పవడంతో అక్కడకు వెళ్లాలేందుకు ఎవరూ సాహసించరు.

### రామ్రీ ద్వీపం

మయన్మార్‌లోని రామ్రీ ద్వీపాన్ని మొసళ్ల ద్వీపం అని కూడా పిలుస్తారు. ఇక్కడ చాలా ఉప్పు నీటి సరస్సులు ఉన్నాయి. ఇవి ప్రమాదకరమైన



మొసళ్లతో నిండి ఉన్నాయి. ఈ ద్వీపంలో నివసిస్తున్న అత్యంత ప్రమాదకరమైన మొసళ్ల బారిన పడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 1945 సంవత్సరం తొలి నెలల్లో రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు దశకు చేరుకోవడంతో రామ్రీ ద్వీపం మొసళ్ల దాడిలో వందలాది మంది జపనీస్ సైనికులు మరణించారు. ఇది చరిత్రలో అత్యంత ఘోరమైనదిగా రికార్డుకెక్కింది. ఈ ఉప్పు నీటి సరస్సుల్లోని మొసళ్లు ప్రపంచంలోనే అతి పెద్ద సరీసృపాలు. సాధారణ మగ నమూనాలు 17 అడుగుల నుండి 23 అడుగుల వరకూ ఉంటాయి.

1945 ఫిబ్రవరి 19వ తేదీన రాత్రి జపాన్ సైనికులపై మొసళ్లు దాడి చేశాయి. ఎక్కడా ఎవరూ అనుభవించని అత్యంత భయంకరమైన రాత్రి అది. జపాన్, బ్రిటీష్ సైనికుల మధ్య జరుగుతున్న యుద్ధ శబ్దాలు, దాడుల్లో గాయపడిన వారి రక్తపు వాసనలతో మొసళ్లు రెచ్చిపోయాయి. దెబ్బతిన్న జపాన్ సైనికులు ఈ ద్వీపంలోకి అడుగు పెట్టడంతో మొసళ్లు వారిపై దాడి చేశాయి. భారీ సరీసృపాల దవడల్లో నలిగిన గాయపడిన జపాన్ సైనికుల అరుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. మొసళ్ల దాడిలో ఆ ప్రాంతం మొత్తం సైనికుల మృత దేహాల ముక్కలతో కాకలావికలమైంది.



### సాబా ద్వీపం

నెదర్లాండ్స్‌లోని సాబా ద్వీపం అత్యంత ప్రమాదకరమైనదిగా రికార్డులకెక్కింది. ఇది అరేబియా ద్వీపకల్పానికి దక్షిణాన ఉంది. ద్వీపం పశ్చిమ భాగం పూర్తిగా దట్టమైన పొదలతో నిండి ఉంటుంది. కేవలం 13 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న ఈ ద్వీపం చాలా అందంగా ఉంటుంది. ప్రపంచంలోని అత్యుత్తమ, అత్యద్భుత గమ్యస్థానాల్లో ఒకటిగా ఇది గుర్తించబడింది. సబా నేషనల్ మెరైన్ పార్క్ ద్వీపం చుట్టుముట్టి ఉంది. అంతేకాకుండా వాటర్స్, దిబ్బలు 200 అడుగుల లోతు వరకూ ఉంటాయి. సముద్ర అడుగు భాగంలోని అగ్ని పర్వతం కారణంగా ప్రత్యేకమైన రాక్ నిర్మాణాలు పైకెత్తినట్లు ఏర్పడిన దిబ్బలు, శిథిలాలు, గుహలు, సొరంగాలు, గోడలు ఇందులో ఉన్నాయి. కానీ ఇది ప్రమాదకరమైనది. ఎందుకంటే ఇది ప్రపంచంలో అత్యధిక సముద్రపు తుపానులను కలిగి ఉన్న ప్రాంతం. తుపానుల కారణంగా ఈ ద్వీపం చుట్టూ చాలా నౌకలు మునిగిపోయాయి.

**- సిహెచ్.వి.వి.రఘుబాబు**





కథ

# జంతువుల సాయం

రామయ్య కొడుకు సుందరం వ్యవసాయం చేసేవాడు. అతడు ఒక కుక్కను పెంచుతున్నాడు. సుందరం ఎక్కడికి వెళ్లినా అది అతన్ని వెంబడించి వెళ్లేది. ఒకరోజు రామయ్య ఇంటికి ఆ రాత్రి దొంగలు వచ్చారు. అది గమనించిన ఆ కుక్క గట్టిగా మొరగసాగింది. కుక్క భయానికి దొంగలు పారిపోయారు. దొంగలు పారిపోవటం చూసి రామయ్య తన కుక్కను తల నిమిరి ఎంతో సంతోషించాడు.

మరొక రోజు రామయ్య రెండవ కొడుకు పట్టణం నుండి వచ్చాడు. అతని పేరు శంకరం. అతడు పట్టణంలో చదువుతున్నాడు. అతడు ఇంటికి వచ్చిన తర్వాత రామయ్య అతనితో తమ ఇంటికి దొంగలు వచ్చిన సంగతి, కుక్క మొరిగిన సంగతి చెప్పి కుక్క విశ్వాసం గురించి చెప్పాడు.

శంకరం భోజనం చేసే సమయంలో అక్కడకు ఒక కోతి వచ్చింది. శంకరం దానికి కొన్ని అరటిపండ్లను ఇచ్చాడు. అది వాటిని పట్టుకుని వెళ్లిపోయింది.

మరొక రోజు వచ్చిన కోతికి శంకరం ఆహారం పెట్టాడు. రామయ్య భార్య కనకమ్మ అది చూసి "ఆ కోతికి ఎందుకు ఆహారం పెడతావురా! ఈ కుక్కకు తోడు మరో కోతి కూడానా" అని చిరాకుగా అంది.

అప్పుడు శంకరం "నీకు తెలియదమ్మా! మనుషుల కన్నా జంతువులే నయం. ఇవి కృతజ్ఞత, విశ్వాసం గలవి" అన్నాడు.

మరునాడు కనకమ్మ తన మెడలోని బంగారు గొలుసును తీసి ఇంటి గోడ పైన పెట్టింది. ఆమె ఇంటిలోపల శుభ్రం చేస్తున్నది. ఇంతలో ఎక్కడి నుండో వచ్చిన ఒక కాకి ఆ బంగారు గొలుసును ముక్కున కరచుకొని అక్కడి నుంచి పారిపోయింది. ఈ హఠాత్పరిణామానికి కనకమ్మ ఆశ్చర్యపోయి బిగ్గరగా "కాకి..కాకి... హుష్... హుష్" అని కేకలు వేసింది. కానీ ఆ కాకి తుర్రుమంటూ అక్కడి నుండి బంగారు గొలుసుతో పాటు పారిపోయింది. కనకమ్మతో పాటు కుక్క భౌ భౌ మంటూ మొరుగుతూ దాని వెంబడి పడినా ఫలితం లేకపోయింది.

ఆ తర్వాత ఇంటికి వచ్చిన శంకరం ఆ విషయం విని "అమ్మా! నీవు బంగారు గొలుసును బయట గోడ పైన పెట్టడం నీదే తప్పు. దాన్ని జాగ్రత్తగా లోపల పెట్టుకోవాలని నీకు తెలియదా?" అని అన్నాడు. కనకమ్మ శంకరాన్ని నిందిస్తూ "ఆ పాడు జంతువులు, పక్షులు నీవు పెట్టే ఆహారానికి అలవాటు పడి ఇక్కడికి వస్తున్నాయి. నీవు ఆ కోతికి ఆహారాన్ని పెట్టకుంటే ఆ కాకి వచ్చేదా?" అని అంది.

"అమ్మా! ఆ కాకి బహుశా బంగారు గొలుసును ఏదో తినే వస్తువులు అనుకొని తీసుకొనిపోయి ఉంటుంది. మళ్లీ అది ఎక్కడో దాన్ని పడేస్తుందిలే. అన్ని చోట్ల మనం వెతికి చూద్దాం. మనకు ప్రాప్తం ఉంటే మన వస్తువు మనకు దొరుకుతుంది. లేకపోతే లేదు" అని అన్నాడు. ఆ బంగారు గొలుసును ముక్కున పట్టుకొని వెళ్లిన ఆ కాకి ఒక చెట్టుపైన వాలి అది తినే వస్తువు కాదని గ్రహించి దాన్ని కిందికి జారవిడిచింది. అది సరిగ్గా కింద ఉన్న కోతికి దొరికింది. ఆ కోతి బంగారు గొలుసును పట్టుకొని రామయ్య ఇంటికి వచ్చింది. అది ఆ బంగారు గొలుసును వారి ఇంటి వాకిట్లో పడేసింది. అది గమనించిన శంకరం "అమ్మా! చూసావా? నీవు నన్ను అనవసరంగా నిందించావు. కోతికి మనం ఆహారం పెట్టిన పుణ్యానికి కాకి నుండి నీ బంగారు గొలుసును సంపాదించి మనకు తెచ్చి ఇచ్చింది. మనం ఆ గొలుసు కోసం వెతికే పని తప్పింది" అని అన్నాడు.

తన బంగారు గొలుసును కోతి తెచ్చివ్వడం చూసిన కనకమ్మ ఎంతో సంతోషించి "ఈ జంతువులు, పక్షులు చాలా మంచివిరా! అవి తినే పదార్థాలు తప్ప మరేవీ ఉంచుకోవు" అని అంది.

ఆనాటి నుండి ఆమె కూడా పశు పక్షాదులను చాలా ప్రేమతో చూస్తూ వాటికి ఆహారం పెట్టసాగింది. అంతేకాకుండా తమ ఇంట్లో జరిగిన సంఘటనను అందరికీ చెప్పి వారు కూడా జంతువులు, పక్షులను ప్రేమగా చూసేటట్లు చేసింది.

**- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య**









## బాలగేయం

### బాబోయ్ చలి



బాబోయ్ చలి
చంపేస్తుంది
బడికి వెళ్లాలంటే
కష్టంగా ఉంది
ఉదయాన్నే అమ్మ
బడికోసం సిద్ధం చేస్తుంది
ఆటోవాలా వస్తాడని
పరుగులతో రెడీ
కావాల్సిందే
స్వెటర్ వేసుకోవాలని
అమ్మ పోరుపెడుతుంది
ఆటలాడేందుకు
చలిలో ఇబ్బందిగా
ఉంది
బాబోయ్ చలి
చంపేస్తుంది
బయటికి వెళ్లాలంటే
వణుకుపుడుతుంది
అయినా శీతాకాలానికి
స్వాగతం పలుకుదాం..

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.ఆకాశ్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ప్రొటీన్‌లంటే ఏమిటి? అవేం చేస్తాయి?**

**జవాబు: ఆకాశ్!** శరీరంలో సహజసిద్ధంగా ఉండే రసాయనాల సమ్మేళనాలే ప్రొటీన్‌లు. అమినో యాసిడ్‌లతో ఇవి ఏర్పడతాయి. కణచర్యలన్నింటినీ నడిపేది ప్రొటీన్‌లే. ఈ క్రమంలో జీవి లక్షణాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు 'మెలనిన్' ప్రొటీన్ మీద కళ్లు, జుట్టు రంగును నిర్ణయించుకుంటుంది. 'మైయోసిన్' కారణంగా కండరాలు కదులుతాయి. కణాంతర్భాగంలో, కణాల మధ్య సమాచార వినిమయానికి ప్రొటీన్ తోడ్పడుతుంది.

**- టి.కార్తికేయన్,** మహబూబ్‌నగర్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. డీఎన్ఏ టెస్ట్ అంటే ఏమిటి?**

**జవాబు: కార్తికేయన్!** సాధారణంగా పిల్లలలో తల్లిదండ్రుల అంశాలు ఏ తీరులో ఉన్నదీ తెలుసుకునేందుకు ఈ టెస్ట్‌ను నిర్వహిస్తుంటారు. డీ ఆక్సీ రైబో న్యూక్లియర్ యాడిస్. ఇది కేవలం ఒక కెమికల్ మాత్రమే కాదు. ప్రతి జీవికి జీవితాధారమైనది. ప్రతి జీవిలోనూ నిక్షిప్తంగా ఉంటుంది. ఒక మనిషిని మరో మనిషి నుంచి విడదీస్తుంది. ప్రతి మనిషిలోనూ లక్ష కణాలు పైగా ఉంటాయి. ఈ కణాలతోనే తల్లిదండ్రుల గుణగణాలు పిల్లలకు సంక్రమిస్తుంటాయి. ఈ కణాలు డీఎన్ఏతో రూపొందుతాయి. వీటి అవసరం ఎక్కువగా జెనెటిక్, ఫోర్సెనిక్ సైన్స్‌లో ఉంటుంది. డీఎన్ఏ టెస్ట్ ద్వారా కేవలం కొన్ని కణాలను గ్రహించి, వాటిని అధ్యయనం చేయడం ద్వారా వ్యక్తులను సులభంగా గుర్తు పట్టవచ్చు. తల్లిదండ్రులు ఎవరైందీ తేల్చవచ్చు. మరణించినవారి మాంసం ముక్క ఆధారంగా ఈ టెస్ట్ జరిపి, ఆ వ్యక్తిని గుర్తించడానికి అవకాశం ఉంది.







**ఫ్యాషన్లు ఎప్పటికప్పుడు మారుతున్నా కళలు మాత్రం ఎప్పటికీ నిలిచి ఉంటాయి. అందుకేనేమో ఈ మధ్య డిజైనర్లు రోజు రోజుకీ మారిపోయే ఫ్యాషన్ల చక్రంలోకి ఒకప్పటి కళలను కోరికోరి మరీ తెస్తున్నారు. కలంకారీ, పిఛ్‌వాయీ, మధుబనీ.. ఇవన్నీ అలా వస్తున్నవే. అందులో భాగంగానే ఇప్పుడు నెట్టింట్లోనూ, దుకాణాల్లోనూ మధుబని హ్యాండ్ పెయింటింగ్ దుస్తులు, యాక్సెసరీలు హల్‌చల్ చేస్తున్నాయి.**



ఒకప్పుడు మధుబని చిత్రం ఇంటి అలంకరణకే పరిమితం. బీహార్, నేపాల్ సరిహద్దుల్లో ఉన్న మిథిలా ప్రాంతానికి చెందిన మహిళలు సహజ రంగుల్లో సన్నని కొమ్మలూ బ్రష్‌లూ, అగ్గిపుల్లలు లేదా వేలికొసల్నీ ముంచి రకరకాల బొమ్మలతో కూడిన చిత్రాల్ని గోడల మీద చిత్రించేవారు. పండగలు, పెళ్లి వేడుకల సమయంలో ఇంటి గోడల మీదా, అలికిన నేల మీదా వాటిని తప్పనిసరిగా వేసుకునేవారు. 1960లలో ఓ విదేశీ కళాకారుడు గోడల మీది చిత్రాలను చూసి ముగ్ధుడై వాటిని కాగితం మీద గీయించుకుని

# ఎల్లలు దాటిన 'మధుబని' కళ

తీసుకెళ్లడంతో ఈ కళ ప్రపంచానికి తెలిసింది. అప్పటి నుంచి స్థానిక మహిళలు వంశ పారంపర్యంగా అబ్బిన తమ కళని కాన్వాస్ మీద, మందపాటి వస్త్రం మీద గీయడం మొదలుపెట్టారు. కాలక్రమంలో అది అందరినీ ఆకర్షించడంతో మిథిలా పెయింటింగ్, మధుబని కళగా ప్రసిద్ధి గాంచింది. క్రమంగా దేశ, విదేశీ ఫ్యాషన్ డిజైనర్లనీ ఈ కళ ఆకట్టుకోవడంతో దుస్తుల మీదికీ వచ్చింది. గోధుమ రంగు మీద ఈ చిత్రాలు కొట్టొచ్చినట్టు కనిపించడంతో మధుబని చిత్రానికి టస్సర్ సిల్కు అద్భుతమైన కాన్వాస్‌గా మారిపోయింది.



### వేసే విధానం

బియ్యప్పిండిలో సహజ రంగుల్ని కలిపి గీసే ఈ చిత్రాల్లో ప్రకృతిలో కనిపించే పక్షులూ, జంతువులూ చెట్లతో పాటు పురాణాల్లోని దేవీ దేవతల బొమ్మలే ఎక్కువగా కనిపిస్తాయి. భారతీయులు పవిత్రమైనదిగా భావించే తులసిమొక్కతో పాటు గౌతముడు జ్ఞానాన్ని పొందిన రావి వృక్షాన్నీ విధిగా గీస్తుంటారు. వీటితో పాటు రేఖా గణిత చిత్రాల్నీ రాజుల కాలం నాటి కొలువుల్నీ, వివాహ వేడుకల్నీ రమణీయంగా చిత్రిస్తుంటారు. మధుబని చిత్రం తాంత్రిక సంస్కృతిని ప్రతిబింబిస్తుందని అంటారు. ఎందుకంటే మిథిలా ప్రాంతం పూర్వం నుంచీ తాంత్రిక విద్యలకు పేరొందింది.

ఈ కళ రామాయణ కాలం నాటిదని కొందరు అంటుంటారు. అప్పట్లో జనక మహారాజు సీతారాముల కల్యాణం కోసం ఊరంతా అలంకరించమని చెప్పడంతో ఇంటి గోడల మీద రంగులతో బొమ్మలు వేయడం ద్వారా ఈ కళ మొదలైందట. ఆ సంప్రదాయం మిథిలా ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తోంది. మధుబని చిత్రం వేసే ముందు కూడా మహిళలు ప్రార్థన చేస్తారట. ముఖ్యంగా కొత్త జంట నివసించే పడక గదిలో మధుబని చిత్రం ఉంటే శుభం జరుగుతుందని వారి నమ్మకం. అందుకే మధుబని చిత్రాన్ని ప్రేమకి, సంతాన సాఫల్యతకు చిహ్నంగా భావిస్తారు. ఈ నమ్మకం ఆ నోటా ఈ నోటా అంతా పాకి ఆధునిక ఇళ్లల్లోనూ మధుబని చిత్రాలను వేయించుకోవడం మొదలైంది.

మధుబని కళ మాత్రమే కాదు, ఓ ఉద్యమమని చెప్పవచ్చు.



2012లో బీహార్‌లోని గ్రామాల్లో రోడ్ల విస్తరణ పేరుతో చెట్లను నరికివేయడంతో అక్కడ 'గ్రామ వికాస్ పరిషత్' అనే స్వచ్ఛంద సంస్థను నడుపుతోన్న షష్టినాథ్ ఝా వాటిని కాపాడేందుకు మధుబని చిత్రాలనే ఆయుధంగా చేసుకున్నాడట. రామాయణ, మహాభారత దృశ్యాలతో ఉండే ఈ కళలో చెట్లూ చిత్రంలో భాగంగా ఉండేవి. అవి లేకపోతే మనిషికి మనుగడ లేదన్న విషయం అందరికీ అర్థమయ్యేలా మధుబని చిత్రాల్లో మిగిలిన బొమ్మలకన్నా చెట్లే ఎక్కువగా చిత్రించేలా చేశాడట ఝా. కనుకనే చెట్టు లేని మధుబని చిత్రం ఉండదదంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు, మధుబని చిత్రాలకు సంబంధించి మిథిలా ప్రాంతానికి చెందిన ఎంతోమంది మహిళా కళాకారులు అనేక అవార్డులు అందుకున్నారు.

దీనికితోడు భారతీయ రైల్వే బీహార్‌లోని సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కి వేయించిన మధుబని ఆర్ట్‌ని చూసి ఐక్యరాజ్యసమితి సైతం ఎంతో అందంగా వుందని ట్విటర్ ద్వారా ప్రశంసించింది. అదొక్కటే కాదు, పట్నా-రాజధాని, జనసాధారణ్ ఎక్స్‌ప్రెస్ రైలు పెట్టెలు కూడా మధుబని చిత్రాలతో కళకళలాడుతుంటాయి. మధుబని నగరంలోని రైల్వే స్టేషన్‌తో పాటు అక్కడి ప్రభుత్వ భవనాలన్నింటినీ ఈ చిత్రాలతోనే తీర్చిదిద్దుతున్నారు. బీహార్‌లోని మిగిలిన స్టేషన్లని సైతం ఈ పెయింటింగ్‌లతోనే ఆకర్షణీయంగా మార్చనున్నట్లు తెలుస్తోంది. ఈ పెయింటింగులతో అనేక స్టాంపులను విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం.





ఫ్యాషన్ చిత్రం జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా మొదలైన దేశాల్లో క్రేజీగా మారిన ఈ చిత్ర కళను చూసాక మన ఫ్యాషన్ డిజైనర్లు తమదైన ప్రత్యేకతను చాటుకుంటూ చీరెలు, డ్రెస్సులు, లెహంగాలు, శాలువాలు, స్టోల్స్, దుపట్టాల మీద స్థానిక కళాకారులతో మధుబని చిత్రాలను వేయిస్తున్నారు. పైగా బరువైన ఎంబ్రాయిడరీలతో విసుగెత్తిన వారికి మధుబని బొమ్మలతో చిత్రించిన బ్లౌజులు, చీరెలు తేలికగా ఉండి బాగా నచ్చేస్తున్నాయి. ఇవన్నీ సహజమైన టస్సర్ సిల్కు మీదే రావడంతో సౌకర్యంగా, కళ్లకి హాయిని గొల్పేలా ఉంటున్నాయి.

హ్యాండ్ పెయింటింగ్ చేసిన మధుబని టస్సర్ సిల్క్ చీరెలను చూసిన తరువాత కాస్త ధర ఎక్కువనిపించినా దాని గురించి పట్టించుకోం. కొవిడ్ సమయంలో మధుబని మాస్క్ సైతం బాగా అమ్ముడు పోయాయి. కుషన్లు, బ్యాగులు, పెన్‌కేస్‌లు... ఇలా రోజువారీ జీవితంలో వాడుకునే ఎన్నో వస్తువులు మధుబని అందాల్ని అద్దుకుంటున్నాయి. సాదా సీదా దుస్తుల మీద సైతం మధుబని బొమ్మల్ని డిజిటల్ ప్రింటింగ్‌తో ముద్రిస్తున్నారిప్పుడు.







# సంసారానికి సగం జీతం

కథ

**సింగంపల్లి శేషసాయి కుమార్**

**తెల్లవారి కోడికూత కంటే ముందే అటూ ఇటూ తిరిగే జనాలు.. జడివానను సైతం లెక్క చేయక జర్కిన్‌లు వేసుకుని బయటకు వచ్చే మారాజులు, గత నెల రోజులుగా అజ్ఞాతవాసం చేస్తున్నారు.**


**సూర్యుడు వద్దామా? వద్దా? అనుకుంటూ.... నాకు ఎటూ తప్పదుగా! అనుకొని రామనాథం ఇంటి తలుపుపై తట్టినట్టు వెలుగులు పంపాడు.**

కానీ తనకేం తెలుసు? అప్పటికే పూజా పునస్కారాలు పూర్తి చేసి, లుంగీ కట్టుకొని ఒక బల్లపై తన ఇంటికి వచ్చే పేపరుపై గల హెడ్డింగులు భార్యకు వినపడేలా గట్టిగా చదువుతున్నారు రామనాథం, ఆమెకు వార్తలు వినిపిద్దామని కాదు, ఎప్పుడెప్పుడు తన మాటలు గుర్తుకు వచ్చి కాఫీకప్పు చేతికిస్తుందా అని.

రామనాథం ఒక ప్రభుత్వ ఉద్యోగి. వచ్చే జీతంతో ఇల్లు ఎలా గడపాలో రోజుకు నాలుగు సార్లు ఆలోచించే రకం.

ఆయన భార్య రమణమ్మ జీతంతో ఈరోజు గడిపేస్తే చాలు.. రేపటికి రోటిపచ్చడి ఉన్నా పర్లేదు అనుకునే రకం.

పేపర్లో ఏదో పెద్ద వార్త వచ్చినట్టు ఈ నెల ఉద్యోగుల జీతాలలో సగం మాత్రమే వస్తుంది" అని గట్టిగా కళ్లు పెద్దవి చేసి మరీ మరీ చూస్తూ పక్కన కాఫీ గ్లాసు వచ్చిన సంగతి కూడా పట్టించుకోకుండా తెగ బాధపడిపోతున్నాడు. ఆ బాధలో భార్య ముఖం కూడా చూడలేక గ్లాసు చేతికందుకుని.



"ఆ.. ఇదంతా మనలాంటి వాళ్లకు మామూలేలెండి. అంగడి బుజ్జి దగ్గర ఈ నెల సరుకులు లెక్క రాసి తెచ్చుకుంటే సరి. రేపు నెల ఎలాగోలా సర్దేద్దాం" అంటూ వంటింట్లోని పాత్రలు సర్దడం మొదలుపెట్టింది.

"నీకేం తెలుసు? వాడి దగ్గరికి పోగానే 'కూర్చోండి' అని కూడా అనడు. ఎంత ఎక్కువ అప్పు రాస్తే వాడి దగ్గర అంత మర్యాద వస్తుంది. నాకా.. ఆ కిటుకు తెలిసి కూడా వాడి దగ్గర అప్పు ఎందుకా అనిఊరుకుంటానాయే".

వంటింట్లోకి వచ్చి "ఈసారి కాస్త పొదుపుగా పోదాం పాప" అంటూ మురిపాలు ఒలకబోశాడు ఖాళీ చేసిన కాఫీకప్పు చేతికి అందిస్తూ రామనాథం.

"అదే మరి.. నేను ఏమైనా దుబారాగా డబ్బులు గాలిలో చల్లుతున్నానా, ఇంటి అవసరాలకేగా పెట్టమన్నది. అదీగాక నా చేతికి డబ్బులు ఏమన్నా ఇవ్వమన్నానా? నేను అడిగింది తెచ్చి ఇంట్లో వేయమన్నాను అంతేగా" అంటూ కాఫీ గ్లాసు తీసి సింకులోని కొళాయి కింద ఉంచింది రమణమ్మ.

"సరే.. కానీ ఈ నెల ఏ సరుకులు కావాలో లిస్టు రాసి పెట్టు. నేను రేపు ఉదయం వేళలో తీసుకువస్తానంటూ టేబుల్‌పై గల పేపర్ రమ్మన్నట్టు వెళ్లి మరీ కూర్చుని, అందులో మునిగిపోయాడు.

.....

'పక్కింటి రామాయణం పామరుడికి కూడా బాగా అర్థమవుతుంది' అన్నట్టు వీరిద్దరి ఇళ్ల మధ్య ఉండే జగన్నాథంకు ఏ మూల చీమ చిటుక్కుమన్నా ఇట్టే తెలిసిపోతుంది. ఒకటా, రెండా.. దాదాపు పాతిక సంవత్సరాలు వారిద్దరిని తన రెండు కళ్లలా చూసుకుంటున్నాడు. పెద్ద దిక్కులా కాదు.. పెద్ద మనసున్న మనిషిలా. అలాగని అక్కడి విషయాలు ఇక్కడ, ఇక్కడి విషయాలు అక్కడ చెప్పే రకం కాదు. ఆచి తూచి మెలిగే రకం. ఒక్క మాటలో చెప్పాలంటే కీలెరిగి వాత పెట్టే రకం అన్నమాట. జగన్నాథం ఊరిలో ఒక పెద్ద పౌరోహితుడు. ఆ ఊర్లో ఉన్న కుటుంబాలన్నీ నావే అనుకునే అంత మంచి రకం. పెళ్లి చేసుకోనంటు వంటి పెద్ద బ్రహ్మచారి. ఎక్కడ ఎవరికి ఏ సహాయం కావలసి వచ్చినా దానిని ఎవరికి తెలియజేస్తే తీరుతుందో వారికి వెంటనే చెప్పే రకం. అంతెందుకు.. అన్న మాటను చేతల్లో చూపించగల మనిషి. నిండుగా కాషాయపు పంచ కట్టి, దానిపై ఒక తెల్ల జబ్బల బనీను ఆపై ఒక దేవుని కండువా కప్పుకొని జీవించే నిరాడంబర జీవి. తనకేం కావాలో దానిని ఎవరింట్లో అయినా సరే వెళ్లి చనువుగా అడిగే ధైర్యం ఉన్నవాడు. ముఖ్యంగా తిండి విషయంలో మొహమాటం చూపని మనిషి. ఓ ఆదివారం ఇద్దరు ఇళ్లకు పనిగట్టుకొని వెళ్లి అక్కడ ఒక అర గ్లాసు, ఇక్కడో అర గ్లాసు కాఫీ తాగి 'వద్దంటే బాగుండదని' ఉభయకుశలోపరిలో భాగంలో–

"చూడండి అమ్మా, ఈరోజు సాయంత్రం మన

ఇంటి వెనకల ఉండే సూర్యనారాయణ శర్మగారి మనవడి బారసాల. మన మూడు కుటుంబాలను తప్పక రమ్మని మరీ మరీ నాకు చెప్పాడు.

మీరు వస్తానంటే సాయంత్రం ఓసారి అక్కడికి వెళ్లి వద్దాం. ఎంతైనా పెద్దవారు కనపడకపోతే బాగుండదు.

"అన్నట్టు ఈరోజు సాయంత్రం మంచి రుచికరమైన భోజనం పెడతారు అనిపిస్తోంది. కాబట్టి మధ్యాహ్నం కాస్త నెమ్మదిగా కడుపు ఖాళీ పెట్టండి. రాత్రికి ఎలాగోలా కాస్త గట్టిగా పట్టు పడదాం" అంటూ వారిరువురు చేతికి అందించిన ఫలహారం లాగించి, చేతిని కండువాకు అటు ఇటు రాసి, వెళ్లి తన ఇంట్లోని ఊగుడు కుర్చీపై కూర్చుండిపోయాడు.

.....

అనుకున్నట్టుగానే సాయంత్రం రమణమ్మ, రాజ్యలక్ష్మి ఇద్దరూ చక్కగా ముస్తాబై తాంబూలం తట్టలు చేతిలో పట్టుకుని అందులో ఓ రెండు బత్తాయిపళ్లు పెట్టుకొని సకుటుంబ సపరివార సమేతంగా సూర్యనారాయణ శర్మ గారి ఇంటికి బయలుదేరారు.

దారిలో ఎవరు లేరు. ఎందుకంటే లాక్‌డౌన్ కదా, ఇల్లు పక్కనే కాబట్టి వీరు త్వరగా ఇంట్లోకి వెళ్లిపోయారు. వీళ్ల అలా వెళ్లారో లేదో.. జగన్నాథం కూడా క్షణంలో అక్కడికి ప్రత్యక్షమైపోయాడు.

తను ఎవరికీ చెప్పకుండానే రెండు కుటుంబాలు అక్కడికి చేరుకోవడంతో నలుగురు ఉండే ఇంట్లోకి తొమ్మిది మంది అయ్యేసరికి ఇల్లు కాస్తా ఇరకాటంగా మారింది.

"ఈరోజు మా మనవడి బారసాల, ఎవరి పిలవకూడదు కాబట్టి నేనే శాస్త్రానికి ఓ పేరు పెట్టేసాను. ఎవరికీ చెప్పలేదు. ఎందుకంటే పరిస్థితులు బాగాలేవు కదా. కానీ మీరు మా మనవడిని ఆశీర్వదించడానికి వచ్చినందుకు చాలా సంతోషం" అంటూ వేళ కాని వేళలో కాఫీ ఇవ్వమని భార్యకు సైగ చేసాడు సూర్యనారాయణ శర్మ.

భర్త మాటలు వినకుండానే ఇట్టే పసిగట్టిందో ఏమో..

వెంటనే ఓ చిన్న లోటా కాఫీకప్పుతో ప్రత్యక్షమైంది.

అది చూసిన రమణమ్మ "అదేమిటి వదినా? ఈ టైంలో కాఫీ! వంటగదిలోకి రా, మాట్లాడుకుందాం" అంటూ ఇద్దరూ వంటింట్లోకి వెళ్లి ముచ్చట్లు పెట్టుకున్నారు.

మాటల మధ్యన అక్కడి పరిస్థితి చూసి ఆశ్చర్యం వేసి ముక్కున వేలేసుకున్నారు.

చిన్న వంటింట్లో షెల్ఫ్‌లన్నీ ఖాళీగా ఉన్నాయి.

పొయ్యి మీద ఒకే గిన్నె అన్నం, అది కూడా పూటకు ఒకరిగా, ఇద్దరిగా అన్నట్టు ఉంది. కూరగాయలు చూస్తే టమాటలు తప్ప మరేవీ కనిపించలేదు. పక్కనే పిల్లాడికి ఓ గ్లాసుడు పాలు ఉన్నాయి. అదీ ఇంకొక గ్లాసు నీల్లు కలిపి "అయ్యో! ఇక్కడ వీళ్లకు ఏమీ లేవు" అనుకుంటూ ఇచ్చిన కాఫీ తాగి ఆ మాటా ఈ మాటా చెప్పుకొని మాటా చెప్పుకొని ఇల్లు చేరేసరికి టైం సరిగ్గా పది అయింది.

"ఇప్పుడు ఏం చేసుకుంటాంలే" అనుకుంటూ జగన్నాథం కునుకు రాకున్నా కోడినిద్ర పోయారు ఇద్దరూ.

తెల్లారేసరికల్లా బయట కూర్చున్న జగన్నాథం "రాత్రి ఇంట్లో భోజనాలు పెట్టలేదని బాధపడ్డారా?" అనగానే–

"ఏంటి అన్నయ్యా, మీరు మరీను. రాత్రి మీరు చేసిన పనికి ఆకలితో నిద్ర పట్టలేదు" అంటూ మూతులు తిప్పకుండానే ముగించేశారు.

"అది కాదమ్మా, నిన్న మిమ్మల్ని కావాలనే అక్కడికి తీసుకుని వెళ్లాను. మీకు తెలుసుగా.. సూర్యనారాయణ పురోహితంతోనే ఇల్లు గడవాలి. కరోనా వల్ల కార్యక్రమాలు ఇల్లు గడపలేని స్థితిలో ఉన్నాడు. నేను ఒకటి రెండు రోజులు పెట్టగలిగాను. కానీ ఒక్క చుక్క నీటిబొట్టుతో దప్పిక తీరదు కదా.

మీలాంటివాళ్లు కలిస్తే దోసెడు నీళ్లు అవుతాయి" అంటూ వాళ్ల కళ్లలోకి తన బాధను పోనిచ్చాడు.

ఈ మాట విన్న ఇద్దరికీ ఒక్కసారిగా ఒళ్లు జలదరించినంత పని అయింది.

"అదే కదా... మన సగం జీతం తగ్గినందుకు నిట్టూర్పులు, నిరుత్సాహం వచ్చినట్లు కూలబడ్డాం. కానీ మన ఇంటి వెనుక ఇంట్లో కనీసం భోజనం చేయలేని పరిస్థితులు ఉన్నాయంటే మనం ఎంత అదృష్టవంతులమో కదా, ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఉండాల్సింది రోజూ మనం అలవాటు పడ్డ జీవితం కాదు. అదుపుతో కూడిన పొదుపుమయమైన జీవితం. ఉన్నదాంట్లో మనం ఒకరి ఆకలి తీర్చిన ఆ పుణ్యం మరొక రోజు మన కుటుంబానికి వస్తుంది" అంటూ ఏదో ఒక వంకతో ఇద్దరు ముందే మాట్లాడుకున్న విధంగా వరుస కలిపి సూర్యనారాయణరావు గారి ఇంటికి వెళ్లి ఒకరు అన్నం ఇస్తే, మరొకరు సాదకాలు ఇస్తే, ఇంకొకరు పోపుదినుసులు ఇస్తూ, ఈ కాలం.. అదే కరోనా కాలం త్వరగా వెళ్లిపోతే బాగుంటుందని మనసులో వేడుకుంటూ, పెదాలపై ఒకరికి సహాయం చేశామన్న ఆనందంతో ఇళ్లకు బయలుదేరారు.

"అన్నట్టు ఈరోజు సాయంత్రం మంచి రుచికర మైన భోజనం పెడతారు అనిపిస్తోంది.

తమ భార్యలు ఇలా రోజూ చేస్తూ ఉండటం చూసి రామనాథం, రమణారావు తమ సంసారానికి ఈ సగం జీతం చాలు కదా అని అనుకుంటూ రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయడం ప్రారంభించారు.

ఇక.. మన జగన్నాథ మాత్రం యధావిధిగా తన ఇంట్లోని పాత రాగి కంచంలోని పచ్చడి పరమాన్నంగా భావిస్తూ పసందైన రుచిని మనసులో అనుభవిస్తూ 'సర్వేజనా సుఖినోభవంతు' అనుకొని తన నులక మంచంపై అమ్మ చీరలతో నేసిన బొంత వేసుకుని ప్రశాంతంగా బబ్బున్నాడు. ❐

**రచనలకు ఆహ్వానం**

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# ఆరోగ్యసిరి ఉసిరి



**ఉసిరి** శరీర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని ఆయుర్వేదంలో 'అమృత ఫలం' అని పిలుస్తారు. ఒక ఉసిరికాయ రెండు సంత్రా పండ్లతో సమానమని అంటారు. ఇందులో ఏడు వందల గ్రాములకు పైగా విటమిన్ సి ఉంటుంది. తిన్న ఆహారం జీర్ణం అయ్యేటట్లు చేయడంలో విటమిన్ 'సి'ది కీలక పాత్ర.

ఉసిరిని క్రమం తప్పకుండా తింటే, తిన్న ఆహారంలో నుంచి ఐరన్‌ని గ్రహిస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్‌ను పోగొడుతుంది. లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. ఉసిరికాయను రోజూ తినడం వల్ల చురుకుగా ఉంటారు. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. నాడీ వ్యవస్థ పనితీరు సైతం మెరుగు పడుతుంది.

ఇంద్రియాలను బలంగా చేస్తుంది. శ్వాస సమస్యల చికిత్సలో ఉసిరిని వాడతారు. కంటిచూపును మెరుగు పరుస్తుంది కనుక దీనిని సంస్కృతంలో 'చక్షుశ్య' అంటే కంటిచూపు అని పిలుస్తారు.



## ఉసిరిలో రకాలు

దక్షిణాసియా దేశాలైన ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ఉసిరి పుట్టిళ్లు. ఇంగ్లీషులో దీనిని 'ఇండియన్ గూస్‌బెర్రీ' అని అంటారు. దానికి కారణం మన పురాణాలు. ప్రస్తుతం ఉసిరి మన దేశంలోనే కాకుండా శ్రీలంక, ఉజ్బెకిస్తాన్, సౌత్ ఈస్ట్ ఏసియా, చైనా వంటి దేశాల్లోనూ పండిస్తున్నారు. మన దేశంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు ప్రాంతాలు ఉసిరి సాగుకు అనుకూలం.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌ఘడ్ జిల్లాలో ఎక్కువ మొత్తంలో ఉసిరిని సాగు చేస్తారు. అయితే, ఒక్కో చోట ఒక్కో రకం ఉసిరికాయలు పండుతాయి.



మన దేశంలో చైకాయ, ఫ్రాన్సిస్, బనారసి రకాలు ముఖ్యమైనవి. చైకాయ రకం ఉసిరికాయలు మిగతా వాటితో పోలిస్తే చాలా చిన్నగా ఉంటాయి. వీటితో ఎక్కువగా క్యాండీలు తయారు చేస్తారు. ఫ్రాన్సిస్ రకం ఉసిరి నుంచి రసం, గుజ్జు తీస్తారు. వాటితో క్యాండీ, పొడి, జ్యూస్ వంటి ప్రొడక్ట్స్ తయారు చేస్తారు. బాగా పండిన స్టేజ్‌ని బనారసి ఉసిరి అని పిలుస్తారు. ఇవి లావుగా, కాస్త తీపి రుచితో ఉంటాయి. కనుక దీనిని వంటల్లో వాడరు. మురబ్బా, క్యాండీ వంటివి చేయడానికి వీటిని ఉపయోగిస్తారు. వీటితో షాంపూలు, హెయిర్ ఆయిల్స్ కూడా తయారు చేస్తారు.



## పురాణాల్లో..

పురాణాల ప్రకారం.. ఒకసారి బ్రహ్మ, విష్ణు ధ్యానం చేస్తున్న సమయంలో కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ నీటి చుక్కలు నేల మీద రాలి, విత్తనంలా మొలకెత్తి అదే ఉసిరి చెట్టయింది అని అంటారు. మరో పురాణం ప్రకారం.. లోకమంతా నీటిలో మునిగిపోతుంటే బాధతో విష్ణువు కంట్లో నీళ్లు తిరిగాయి. ఆయన కన్నీటి బొట్లు నేలపై పడి ఉసిరి చెట్టు మొలకెత్తిందని అంటారు. ఏదేమైనప్పటికీ భూమిపై కనిపించిన మొదటి చెట్టు ఇదేనని, అందుకే దీనికి 'అదిరోహ' (ప్రి-ఎనిమినెంట్ ట్రీ) ని పేరొచ్చింది.

## సంబురాలు

ఉసిరి చెట్టును విష్ణు రూపంగా భావించి, క్షీరాబ్ది ద్వాదశి రోజున తులసితో వివాహం చేస్తారు భక్తులు. కార్తిక మాసంలో తొమ్మిదో రోజు దేశంలో కొన్ని చోట్ల ఆమ్ల నవమి పండుగ చేసుకుంటారు. ఈ మాసంలో ఉసిరిచెట్టు కింద భోజనం చేస్తే ఏడాదంతా ఆహార దోషాలు ఉండవని నమ్మకం. హోలీ పండుగకు నాలుగు రోజుల ముందు 'ఉసిరి ఏకాదశి' వస్తుంది. ఆ సందర్భంగా ఉసిరికి చెట్టుకు ప్రార్థనలు చేస్తారు.

# తెలుగు పత్రికారంగం తీరుతెన్నులు

సాహిత్యం



బ్రిటిష్ పాలనా కాలంలో 1835లో బెల్లారి క్రిస్టియన్ సంఘం ఆధ్వర్యంలో క్రైస్తవ మిషనరీల మాస పత్రికగా మద్రాస్ నుంచి 'సత్యదూత' వెలువడింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో అంతర్భాగమైన ఆంధ్ర ప్రాంతంలో క్రమేపీ ముద్రణా సౌకర్యాలు రావడంతో క్రైస్తవ, హిందూ మత ధర్మ ప్రచార లక్ష్యం నుంచి పత్రికలు సామాజిక సంస్కరణలు, స్వరాజ్యం సాధించే లక్ష్యం వైపు, సాహితీ రంగం వైపు మలుపు తిరిగాయి. 1842లో వర్తమాన తరంగిణి, 1846లో వృత్తాంతిని, 1862లో హితవాది, 1863లో శ్రీయక్షిణి, 1864లో తత్వబోధిని, 1871లో ఆంధ్ర భాషా సంజీవని, 1874లో వివేక వర్ధని, 1886లో ఆంధ్ర ప్రకాశిక తొలి పత్రికలుగా వెలుగు చూసాయి. "పత్రికయందు ఈ కింది విషయాలుండును. ఆంధ్రోద్యమం, వార్తావళి, చిత్రపటములు, రాజ్యాంగ వ్యవస్థలు, మత సాంఘిక చర్చలు, నిరంకుశాధికారాన్ని తగ్గించుటకు ప్రజాతంత్రమును వృద్ధి చేయు సాధన భూతములైన వ్యవస్థలు ఉచిత రీతిలో అన్ని జాతుల భిన్నాభిప్రాయాలు, ఉదార ఆదర్శ భావాలు నిష్పక్షపాత బుద్ధితో వ్యక్తీకరించబడును" అన్నారు ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు. ఆంధ్ర పత్రిక అమృతాంజనం వజ్రగుళికల విక్రయ ప్రకటనతో బొంబాయిలో ప్రారంభించబడి తర్వాత మద్రాస్, విజయవాడ చేరింది. 185 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన తెలుగు పత్రికా రంగంలో కాకినాడ నుంచి కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ 'రవి' వారపత్రిక, గుంటూరు నుంచి 'ధర్మసాధని, 'ధర్మ ప్రకాశిక', 'దేశాభిమాని' రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, నెల్లూరు, వరంగల్లు, నల్లగొండ తదితర పట్టణాలలో మద్రాస్ నుంచి కేంద్రీకృతమైంది. 1902 ఫిబ్రవరి 1న రాజకీయ, సంఘ సంస్కరణ, వర్తక వాణిజ్యాభివృద్ధి లక్ష్యంతో కృష్ణా మండల సంఘం పక్షాన స్థాపించబడిన కృష్ణా పత్రిక రాజకీయ చైతన్యానికి, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించింది. దేశభక్త కొండా వెంకటప్పయ్య ఒక సంపాదకీయంలో ఇలా రాసారు.

"కన్యాశుల్కం కేవలం శాస్త్ర నిషిద్ధమైన హేయమైన దురాచారమని అందరికీ తెలిసిన విషయమే. కానీ క్రూరులైన తల్లిదండ్రులు మంచి చెడ్డలు గుర్తెరుగని పసిపిల్లలను దయాదాక్షిణ్యాలు లేకుండా కాగల భర్తతో సౌఖ్యము పొందునో పొందదో అనే సంగతి లేశమైనా పాటింపక, ద్రవ్యమును అపేక్షించి, కాటికి కాలు జాచియున్న ముసలివానికిచ్చి వివాహాలు చేస్తుంటే యిలా చేయడం యుక్తం కాదని పల్లెత్తు మాట అనేవారు లేరు".

1874లో కందుకూరి వీరేశలింగం వివేకవర్ధని మద్రాసులో ప్రచురణ ప్రారంభించింది తదనంతరం రాజమండ్రి చేరింది. వార్తా పత్రికలు ఆంగ్లేయ సంప్రదాయాన్ని అనుసరించి తెలుగులో ప్రవేశించాయి. కొక్కొండ వేంకటరత్నం ఆంధ్ర భాషా సంజీవని, పూండ్ల రామకృష్ణయ్య అముద్రిత గ్రంథ చింతామణి, కాకినాడ నుంచి మందార మంజరి, ప్రబంధ కల్పవల్లి, రాజయోగి, పోలవరం నుంచి కొచ్చెర్ల కోట రామచంద్ర వెంకట కృష్ణారావు సరస్వతి, ఏలూరులో మంత్రి ప్రెగడ భుజంగరావు మంజువాణి, రాజమండ్రిలో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి కళావతి, చిలకమర్తి లక్ష్మీ నరసింహం మనోరమ, పిఠాపురంలో రామకృష్ణ కవులు కవిత, మద్రాసులో మన్నవ బుచ్చయ్య హిందూ జన సంస్కారిణి, పనప్పాకము అనంతాచార్యులు వైజయంతి, గుంటూరు జానపాటి పట్టాభిరామయ్య శాస్త్రి అభినవ సరస్వతి, బందరులో కౌతా శ్రీరామ శాస్త్రి శారద, కాశీనాథుని వారి భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, ముట్నూరి వారి కృష్ణా పత్రిక, మద్రాస్ నుంచి సమదర్శిని, త్రిలింగ, గట్టుపల్లి శేషాచార్యులు శశిరేఖ వార్తా సాహిత్య, భాషా విషయక, వార్తా పత్రికలుగా వచ్చినట్లు ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరిలో జయంతి రామయ్య రాసారు.

గిడుగు వెంకట రామమూర్తి వ్యవహారిక భాషోద్యమాన్ని తెలుగు పత్రికలు అందిపుచ్చుకొన్నాయి. 1910 తరువాత తెలుగు వాడుక భాషగా, పత్రికా భాషగా నాగరికంగా భాషా ప్రయోజనాన్ని సమర్థంగా సంపూర్ణంగా తెలుగు పత్రికలు స్వీకరించాయి. గిడుగువారి తుది విన్నపాన్ని ఎన్.జి.ఆచార్య, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు, కొడవటిగంటి కుటుంబరావు పత్రికా సంపాదకులు, రచయితలు తు.చ. తప్పకుండా అమలు చేసి జన సామాన్యపు నోళ్లలోని వాడుక పలుకుబడిని పత్రికా భాషగా తీర్చిదిద్దారు. పత్రికా రచనా వ్యాసంగాన్ని ఆలంబనగా చేసుకొని, కొత్త పదజాలాన్ని సృష్టించి, తెలుగును జీవద్భాషగా తీర్చిదిద్దారు.

"వార్తయందు జగము వర్తిల్లుచున్నది
యదియు లేనినాడు యఖిల జనులు
అంధకార మగ్నులగుదురు గావున
వార్త నిర్వహింపవలయు పతికి"

అని నన్నయ మహాకవి మహా భారతం సభా పర్వంలో పేర్కొన్నట్టుగా ప్రస్తుతం సమాచారం అనే అర్థమే రూఢమయింది. 1900 నుంచి శతాబ్ది కాలంలో స్వాతంత్ర్యోద్యమంలో, ప్రజాస్వామ్య మహోద యంలో తెలుగునాట అటూ యిటూ తెలుగు పత్రికలు శక్తివంతమైన ఆయుధాలుగా సేవలందిస్తున్నాయి. 1925లో సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ, వద్దిరాజు సోదరులు తెలుగు పత్రిక, తెలంగాణ సాహితీ సీమలో నీలగిరి, సుజాత, భాగ్యనగర్, ప్రగతి, కాకతీయ, ప్రజావాణి, ఎందరో పత్రికాధిపతులు, ఎన్నో వార్తా పత్రికలు సేవలందించాయి. రెండు తెలుగు రాష్ట్రాలుగా అవతరించిన ప్రస్తుత నేపథ్యంలో శతాబ్ది కాలం క్రితం మద్రాస్‌లో విలసిల్లిన తెలుగు పత్రికా రంగానికి హైదరాబాద్ కేంద్ర స్థానంగా, ఎలక్ట్రానిక్ మీడియాతో పోటీ ఒడుదుడుకులు కాలగమనంలో ఎదుర్కొం టోంది.. పురోగమిస్తోంది.

**- జయసూర్య**





# పిల్లలు ఆడుకోవడానికి మాగ్నెటిక్ దిండ్లు



పిల్లలకు ఎన్ని బొమ్మలున్నా సరిపోవు. నిజమైన ఇల్లుబొమ్మ కావాలని, జారుడుబల్ల కొనమని... ఇలా ఒకటేమిటి? వాళ్లకు ఆ క్షణంలో ఏది కావాలనిపిస్తే అది అడుగుతుంటారు. అన్నీ కాకపోయినా కనీసం ఒకటి రెండు అయినా కొనిచ్చి పిల్లల సరదా తీర్చాలని పెద్దవాళ్లకున్నా అవి బోలెడు ఖరీదులో ఉంటాయి. నాలుగు రోజులయ్యాక వాళ్లకు అవి బోర్ కొడితే వాటిని ఏం చేయాలో తెలియదు. ఈ ఇబ్బందులన్నింటికీ పరిష్కారం చూపిస్తుంది 'మాగ్నెటిక్ పిల్లో ఫోర్ట్'. ఇదీ దిండ్ల సెట్టే. కానీ వీటితో పిల్లలు తమకు నచ్చిన ఆకారంలో పేర్చుకుంటూ అవన్నీ ఎక్కడ పడిపోతాయోననే భయం లేకుండా ఎంతసేపైనా ఆడుకోవచ్చు. పిల్లలు వాళ్ల కోరుకున్నట్లు చాలా డిజైన్లలో మార్కెట్‌లో లభిస్తున్నాయి. వాటిలో చీకట్లో వెలిగేవీ, పూలు, జంతువులు, వాహనాలు, ఆహార పదార్థాల ఆకారాల్లో ఉన్నవీ, వాళ్లెంతో ఇష్టపడే కార్టూన్ పాత్రలు, అక్షరాలు-కథలు నేర్పించేవీ, దిండులోనే దుప్పటి ఉన్నవీ.. ఇలా బోల్డన్నీ రకాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

ఈ దిండ్లతో పిల్లలకు ఇష్టమైన ఆకారంలో తయారు చేసుకోవచ్చు.

## ఎలా పేర్చాలి?

మాగ్నెటిక్ పిల్లో ఫోర్ట్‌లో అయస్కాంతం ఉంటుంది. ఇవన్నీ ఒక సెట్ రూపంలో రక రకాల ఆకృతుల్లో వస్తాయి. ఫోమ్‌తో తయారైన ఈ దిండ్ల కవర్ల అంచులకే అయస్కాంతం ఉంటుంది. వీటితో కోరుకున్న ఆకారంలో జారుడు బల్ల, సోఫా, గోడ, చిన్న ఇల్లు, పరుపు, టేబుల్, మెట్లు... ఇలా ఎలా కావాలంటే అలా చేసుకోవచ్చు. ఆట పూర్తయిన తరువాత దిండ్లనిటినీ వేరు చేసి చక్కగా సర్దేసుకుని ఓ చోట పెట్టేసుకోవచ్చు. ఎక్కువ స్థలం ఆక్రమిస్తాయన్న బెంగ ఉండదు. వీటి కవర్లను తీసి శుభ్రంగా ఉతికేందుకు అనువుగా వుంటాయి. ఈ దిండ్లు త్రికోణం, చతురస్రం, దీర్ఘ చతురస్రం, గుండ్రంగా.. మొదలైన ఆకారాల్లో లభిస్తున్నాయి. వాటి కవర్లు సైతం నీలం, ఊదా, పసుపు, ఆకుపచ్చ.. ఇలా అనేక రంగుల్లో దొరుకుతాయి. మార్కెట్‌లో కనిపించిన బొమ్మలన్నీ కొనేసి, కొన్ని రోజులు వాటిని వాడుకున్న తరువాత వృథాగా పడేసేవారు ఇలాంటి దిండ్లను కొనుక్కుంటే బాగుంటుంది. పిల్లలకు వీటితో ఆడుకోవడం మానేసాక ఎంచక్కా దిండ్లలా వాడుకోవచ్చు. ✦



# ఎన్ని ద్వారాలు ఉండాలి?


**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458






**ఒక** గృహాన్ని నిర్మించే ముందు పరిపూర్ణమయిన ప్లాను ముందు సిద్ధం చేసుకోవాలి. ద్వారాలు, కిటికీలు, అలమారలు అన్నింటినీ ప్లానులో ముందే స్థిరపరచుకోవాలి. ప్లాను వేసుకునేటప్పుడు కూడా వీలునుబట్టి కానీ, అభిరుచిని బట్టిగానీ ఇష్టం వచ్చినట్టు తలుపులు, కిటికీలు, అలమారలు, గదులు మొద లయివి ఏర్పాటు చేసుకోవడం మంచిది కాదు.

వాస్తు బాగా తెలిసిన వ్యక్తుల సలహా సంప్రదింపులు అవసరం. మోజుపడి చిత్తం వచ్చినట్లు గృహ నిర్మాణం చేసుకుంటే చివరకు బూజే మిగులుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఇంటికి ద్వారాలుగానీ, కిటికీలుగానీ, అలమారలుగానీ సరి సంఖ్యలో ఉండాలి. రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది.. ఇలా అయితే సున్నా '0' అంతమయ్యే సంఖ్య కూడా సరిసంఖ్యనే కానీ తలుపులు 10,20,30 ఇలా ఉండకూడదు.

ద్వారాన్ని పూర్తిగా గోడకుగానీ, పిల్లర్‌కుగానీ ఆనించి నిర్మించకూడదు. అధమం నాలుగయిదు అంగుళాలు అయినా తలుపుకు, గోడకుగానీ పిల్లర్‌కుగానీ మూల మొత్త(చిన్న గోడ) ఉంచాలి. అంటే గోడకు ద్వారానికి ఆమాత్రం స్థలాన్ని విడిచి ద్వారం నిర్మించాలి. ద్వారానికీ ప్రధాన గోడకూ మధ్య తలుపును పట్టే మొత్త (చిన్న గోడ) వుండాలి.

ఒక గృహానికి ఉన్న ద్వారాలు ఆ గృహానికి మాత్రమే పరిమితమవుతాయి. గృహానికి బయట కాంపౌండు లోపల వేరుగా నిర్మించిన ఏ కట్టడాలయినా వేరుగా పరిగణించాల్సి ఉంటుంది.

ప్రధాన గృహానికి బయట టాయిలెట్స్, బాత్‌రూమ్స్ ఉంటే వాటి తలుపుల సంఖ్య వాటికే పరిమితంగానీ ప్రధాన గృహంలోని తలుపుల సంఖ్యతో కలపకూడదు. వేటికవే ప్రత్యేకంగా సరిసంఖ్యలో వుండేట్లు జాగ్రత్తపడాలి.

గృహంలో ద్వారాలను అమర్చుకునేటప్పుడు ఇంట్లో కట్టే 'కమాన్'లుగానీ, 'గ్రిల్' తలుపులుగానీ ద్వారాల లెక్కలోకి రావు.

ఇంటి పై కప్పును తాకకుండా వుండే తలుపులు సాధారణంగా లెట్రిన్స్‌కు, బాత్ రూమ్స్‌కూ వుంటుంటాయి. పై కప్పును తాకని ద్వారాలు కూడా ద్వారాలుగా లెక్కలోకి రావు.

పూజా గదులు నిర్మించుకునేవాళ్లు ఓ మూల దాన్ని ప్రత్యేకంగా చిన్నవిగా నిర్మించుకుని పై కప్పుకు తాకని తలుపులనుగానీ, గ్రిల్ తలుపునుగానీ కమాన్‌నిగానీ నిర్మించుకుంటారు. అలాంటివి కూడా ద్వారాల లెక్కలోకి రావు.

ప్రహరీ గోడలకు తాకకుండా మధ్యలో ఇల్లు కట్టినా, ప్రహరీ గోడలను ఆనుకొని ఇల్లు కట్టి ఉత్తరం వైపుగానీ, తూర్పు వైపుగానీ ఒకే ఖాళీ స్థలం వదిలి అక్కడ 'మెయిన్ గేటు' కట్టుకున్నా, ఆ 'మెయిన్‌గేట్'ని ఇంటి ద్వారాల సంఖ్యలో కలపకూడదు. ప్రహరీలో 'సర్వెంట్ క్వార్టర్స్', 'స్టోర్ రూములు' మొదలయినవి కట్టినప్పటికీ వాటి ద్వారాలు సరి సంఖ్యలో ఉండేట్లు చూసుకోవాలి. ఉదా: ఇంట్లో ఏడు ద్వారాలుంటే బయట కట్టిన స్టోర్ రూమ్‌కి ఒక ద్వారం కట్టి మొత్తం ఎనిమిది ద్వారాలు న్నాయని సరిపెట్టుకోవడం పొరపాటు. ఇంటికి ఆరు, స్టోర్ రూమ్‌కి రెండు ద్వారాలుంటే వేటికవి సరి సంఖ్యలా సరిపోతాయి. అయితే ద్వారాలు మాత్రమే సరి సంఖ్యలో ఉంటే వాస్తుదోషాలు లేవనుకోవటం పొరపాటు.

గృహానికి నాలుగు వైపులా ఉండే ఖాళీ స్థలాల గురించి శ్రద్ధ తీసుకోవాలి. పడమర కంటే తూర్పుకు; దక్షిణం కంటే ఉత్తరానికి ఎక్కువ ఖాళీ స్థలం వుండాలి.

## ద్వారాలు ఎలా నిర్ణయించాలి?

ఇంటిలో నడక ఇంట్లో వుండేవాళ్లను శుభా శుభాల ఫలితం అందుకునేలా నడిపిస్తుంది. అందువల్ల ఇంట్లో నడక శుభ ఫలితాలను అందుకోగలిగేంత శ్రేష్ఠంగా వుండటం అవసరం.

'ఉత్తర ఈశాన్యం' నుండి 'దక్షిణం ఆగ్నేయం' వైపు నడక; అలాగే 'దక్షిణ ఆగ్నేయం' నుండి 'ఉత్తర ఈశాన్యం' వైపు నడక శుభాలను అందిస్తుంది. అందువల్ల ద్వారాలను అలా నడక వచ్చే విధంగా అమర్చుకోవటం శ్రేష్ఠం.

'తూర్పు ఈశాన్యం' నుండి 'పడమర వాయువ్యం' వైపు నడక కూడా శ్రేష్ఠమైంది. అలాగే 'పడమర వాయువ్యం' నుండి 'తూర్పు ఈశాన్యం' వైపు నడక కూడా. ద్వారాలు ఈ దారిలో నడిచేం దుకు అనువుగా నిర్మించుకోవటం ఉత్తమం. ప్రతి గదికి ఉత్తర ఈశాన్యంలో గానీ, తూర్పు ఈశాన్యంలోగానీ, పడమర వాయువ్యంలోగానీ, దక్షిణ ఆగ్నేయంలోగానీ తలుపు ఏర్పాటు చేసుకోవటంలో శ్రద్ధ తీసుకోవటమే కాకుండా ఆ తలుపుకు ఎదురుగా తలుపు ఏర్పాటు చేస్తే పై చెప్పిన పద్ధతిలో తలుపులు అమరుతాయి.

అయితే వరుసగా వుండే గదులకు మాత్రమే ఇలా అమరుతాయి. వరుసగా లేని గదుల సముదాయానికి కూడా పైన చెప్పిన స్థలాల్లోనే ద్వారాలు అమర్చుకోవటం ఉత్తమం. అయితే నడక నేరుగా పైన చెప్పిన పద్ధతిలో అంటే ఉత్తర ఈశాన్యం, దక్షిణం ఆగ్నేయాల మధ్యగానీ, తూర్పు ఈశాన్యం, పడమర వాయువ్యం మధ్యనగానీ లేకున్నా ప్రతి గదిలో నుండి నడిచే దారి దేనికదే అవుతుంది. కనుక శుభ ఫలితాలు కలగటంలో మార్పుండదు. అలా కాక తూర్పు, పడమరల మధ్య; ఉత్తర, దక్షిణాల మధ్య నడక వచ్చేలా గృహాలు నిర్మించుకోవడంలో తప్పు లేదు. ఎటొచ్చీ గది మధ్యలో తలుపు తలుపులుండటం వల్ల సామాన్లు సర్దుబాటు విషయంలో ఇబ్బంది కలుగుతుంది.కానీ వాస్తు ప్రకారం మాత్రం దోషంకాదు. పశ్చిమ, దక్షిణాలలో తలుపు పెట్టాల్సి వస్తే ఉచ్ఛస్థానంలోనే అమర్చుకునే ప్రయత్నం చేయాలి.

# ఏడేళ్ల తర్వాతే పంపుతాం



జపాన్ నుంచి ఒక వ్యక్తి మన ఊరికి వచ్చారు. ఆయన అక్కడక్కడా చూడవలసిన చూసుకుంటూ ఓ చోట మన ఊరి మనిషితో మాటలు కలిపాడు.

"మీకు ఎంత మంది పిల్లలు?" అని అడిగాడు జపనీయుడు.

"ఒకే ఒక అమ్మాయి" అన్నాడు మన ఊరి మనిషి.

"వయసెంత?" అడిగాడు జపనీయుడు.

"మూడేళ్లండీ" అన్నాడు.

"మీ అమ్మాయిని చూడొచ్చా?" అని అడిగాడు జపనీయుడు.

"స్కూలుకి వెళ్లింది" అన్నాడు మన ఊరి మనిషి.

అప్పుడా జపనీయుడు విస్తుపోయి నిల్చున్నాడు.

"ఏమిటి? మూడేళ్లకే స్కూలుకి పంపేరా?" అని అడిగాడు జపనీయుడు ఆశ్చర్యంగా.

"అవునండీ... ఎల్కేజీ చదువుతోంది. అది సరే.. మీరేంటి? మరీ అంత ఆశ్చర్యంగా అడుగుతున్నారు, మీరు మీ ఊళ్లో మూడేళ్ల వరకు పిల్లలను స్కూలుకి పంపరా?" అడిగాడు మన ఊరి మనిషి.

"మా ఊళ్లోనా? పిల్లలకు ఏడేళ్లు లేదా ఎనిమిదేళ్లు రావాలి. అప్పుడే పిల్లలను స్కూళ్లకు పంపుతాం".

అప్పుడు ఆశ్చర్యపోవడం అనేది మన ఊరి మనిషి వంతైంది. అనంతరం ఆ విదేశీయుడు వివరంగా చెప్పాడు..

"చిన్నారుల మనసు పరిపక్వం చెందిన తర్వాతే స్కూలుకి పంపుతాం. ఆ వయస్సు తర్వాతే వారికి స్కూలుకి వెళ్లాలన్న ఆరాటం కలుగుతుంది.

ఏడేళ్ల వరకూ ఆ లేత మనసు ప్రేమను, స్నేహాన్ని, ఇతర మనుషుల పరిచయాలను ఎక్కువగా ఆశిస్తుంది.

ఓ చిన్నారి ఎంతసేపు వారి అమ్మతో ఉంటుందో అలాగే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులతోనూ, ఇరుగు పొరుగుతోనూ సమయం గడపడానికి ఇష్టం చూపుతుంది. ఈ క్రమంలోనే వారి మనసు విప్పారుతుంది.

వయస్సుకు తగ్గ ఎదుగుదలా ఉంటుంది. అంతేకాదు, ఇంట్లో ఉండే చిన్నారి ఇంటి వాతావరణాన్ని అర్థం చేసుకుంటుంది, అనేక విషయాలను గ్రహిస్తుంది.

ఇటువంటి వాతావరణం స్కూల్లో లభించే అవకాశం ఉండదు. అక్కడ అందరూ ఒకేలా నడచుకుంటారు. దృష్టంతా ఒక్కరి పైన పెట్టడం అన్నది కూడా అసాధ్యం అక్కడ. నలుగురిలో నారాయణ అన్నట్లే ఉంటుంది అక్కడి వాలకం.

కానీ అదే సమయంలో ఇంట్లో ఉండే చిన్నారి అందరితోనూ సహజాతి సహజంగా ఉండటాన్ని అలవరచుకుంటుంది. అంతేకాదు, ఇంటి వాతావరణాన్ని కాకుండా బయటి ప్రపంచాన్ని కూడా చూడాలనే ఆరాటం కలుగుతుంది.

కొత్తగా పరిచయాలు చేసుకోవాలని, పది మందిని చూడాలని, వారితో మెలగాలనే ఆశ కలుగుతాయి. ఇందువల్ల వారి మనసు వికసిస్తుంది. ఇవన్నీ జరిగేవి ఆ ఏడేళ్లలోపే. ఇలా ఆ చిన్నారి పక్వత పొందిన తర్వాత స్కూల్లో చేర్చడమే సక్రమ పద్ధతి. అలా కాదని.. ఓ చిన్నారి ఏమిటని తెలుసుకునేలోపే స్కూల్లో చేర్పించి ఆ చిన్నారికి తగని విషయాలన్నింటినీ మనసులో నమోదయ్యేలా చేయించడం వల్ల వారి మెదడు విప్పారదు. లేలేత అనుభూతులు ఆదిలోనే తుంచేసినట్టు అవుతందన్నాడు జపనీయుడు.

అతను చెప్పినవన్నీ మన ఊరి పిల్లలకు సరిపోతాయా, సరిపోవా? అన్నది పక్కన పెడితే.. ప్రతి ఒక్కరూ ఆలోచించవలసిన అంశమిది.



ఎందుకంటే పిల్లల గురించి మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఏం చెప్తున్నారంటే–
బాల్య ప్రాయంలో ప్రతిఒక్కరికీ ప్రేమ, ఆప్యాయత, అనురాగం ఎంతో అవసరం. వాటినిబట్టే వారి భవిష్యత్తు ఏర్పడుతుంది అని.
చిన్నతనంలో తల్లి కనుసన్నలలో ఎదిగిన చిన్నపిల్లలు తర్వాతి కాలంలో ఉన్నత స్థితిని పొందుతున్నారని వారి అభిప్రాయం.
ఓ చిన్నారి చక్కగా ఎదగాలంటే మంచి ఆహారం మాత్రమే సరిపోదు. ప్రియమైన పలకరింపు, ప్రేమతో అక్కున చేర్చుకోవడం వంటివి కూడా ఎంతైనా అవసరం. ఇందుకు సంబంధించి అనేక అధ్యయనాలు చేసారు. కొన్ని అనాథాశ్రమాలలో మంచి ఆహారం పెడుతున్నా అక్కడ పెరుగుతున్న పిల్లలు సరిగ్గా ఎదగడం లేదని అన్నారు. కనుక మన ఊరి తల్లులు ఈ విషయాన్ని ఆలోచించాలి.
చిన్నతనంలోనే పిల్లలను ప్రేమతో పెంచాలి, చూసుకోవాలి.
అలాగని అతి గారాబం తగదు.
అంతేతప్ప వారిని వారి దారిన విడిచిపెట్టి పెద్దలు తమ దారిన తాము వెళ్లిపోకూడదు.
ఓ చిన్నారి చెప్పగా విన్నాను... "నేనూ, మా నాన్న రోజూ హోటల్లోనే తింటామని".
"ఎందుకలా? మీ అమ్మ ఇంట్లో వంట చేయదా?" అని అడిగితే ఆ చిన్నారి చెప్పిన జవాబు..
"మా ఇంట్లో రోజూ మా అమ్మే వండుతుంది, బోరు కొడుతోంది. అందుకే మేం హోటల్లో తింటాం. ఓ మాట మంతీ ఉండదు. ఏదో తన వంతనుకుని వంట చేయడం తప్ప చేరదీయడమనేది తన నిఘంటువులో లేదనుకుంటుంది అమ్మ" అని.
ఇంతటి దీనావస్థ మరెవరికీ రాకూడదు.

**- యామిజాల జగదీశ్**

---

**భూతాపం భవితకు శాపం**

**(11వ పేజీ తరువాయి)**

మితిమీరిన ఎరువుల వాడకం పశువులను అతిగా మేపడం వల్ల నేల సంపీడం, కోత, అడవి నిర్మూలన, నీటి లభ్యత తగ్గడం వంటి కారణాల వల్ల 34 శాతం వ్యవసాయ భూమితో సహా ప్రపంచ నేలలో 13 శాతం నాణ్యత క్షీణించింది.
వర్షా కాలంలో పల్లపు ప్రాంతాల నుంచి వెలువడే విష వాయువులు వర్షపు నీటితో కొట్టుకుపోయి ఇతర ప్రాంతాలకు వెళ్లి ఒక చోట నుంచి మరొక చోటికి విస్తరించబడి మట్టి నాణ్యతను దెబ్బ తీస్తుంది.
ప్రపంచం రోజురోజుకు అభివృద్ధి పేరిట ప్రజల అవసరాలు, ఆశలకు అనుగుణంగా పెద్ద ఎత్తున కొత్త కొత్త నిర్మాణ పనులు చేపట్టడం వలన, వాటిలో ఉపయోగించే లోహాలు ప్లాస్టిక్, కలప మొదలైన అనేక ఉప ఉత్పత్తులు సరిగ్గా పారవేయకపోతే అవి మట్టికి హాని కలిగిస్తాయి.
పెరుగుతున్న సాంకేతికతతో రేడియో ధార్మిక అణు పదార్థాలు ప్రమాదకరంగా మట్టిని కలుషితం చేస్తున్నాయి.
మానవాళిని మరింత ఆందోళనకు గురి చేసే గ్లోబల్ వార్మింగ్ కూడా మట్టి నాశనానికి ముఖ్య కారణంగా భావించవచ్చు. గ్లోబల్ వార్మింగ్ అనేది వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ కంటెంట్ పెరుగుదల కారణంగా భూమి ఉష్ణోగ్రత పెరుగుదల ప్రక్రియ, మానవుని సుఖమయ జీవనం కోసం వాహనాలను విపరీతంగా వాడడం, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, శిలాజ ఇంధనాలను అత్యధికంగా ఉపయోగించడం వల్ల గ్రీన్ హౌస్ వాయువులు, రేడియో ధార్మిక పదార్థాలు విడుదలై గ్లోబల్ వార్మింగ్ పెరుగుతుంది. మట్టిని రక్షించడానికి అతి ముఖ్యమైనటు వంటి పరిష్కారం చెట్లను నాటడం, చెట్లు నాడటం వల్ల నేల కోత అరికట్టబ డుతుంది. కాలుష్యాన్ని నివారించబడు తుంది. చెట్లు ప్రగతికి మెట్లు కనుక మన గృహానికి జీవనాధారంగా పని చేసే చెట్లను పెంచడం వల్ల మాతృభూమి ఆరోగ్యాన్ని పునరుద్ధరించవచ్చు. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్ తగ్గించి ఆక్సిజన్ స్థాయిని పెంచుతాయి.

**ముగింపు**

వాతావరణం మార్పుల ప్రభావం భూగోళానికి ముప్పు ముంచుకొస్తుంది. సమస్త ప్రాణికోటికి మరణ శాసనం రాస్తున్నాయి. పెరిగే సముద్ర మట్టాలు, మునిగే ప్రాంతాలు, భగ్గుమనే ఎండలు, కరువు రక్కసి కరాళ నృత్యం, ఎండే పొలాలు, ఇటీవల వివిధ నగరాలలో వరదల ప్రభావం భవిష్యత్తు భయానక పరిస్థితులకు ప్రమాదక ఘంటికలను మోగిస్తుంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో 47 డిగ్రీల సెల్సియస ఉష్ణోగ్రత నమోదు కావడం గ్లోబల్ వార్మింగ్‌కు హెచ్చరిక. భూఉష్ణోగ్రత పెరుగుదల 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ కన్నా ఎక్కువ ఉంచకుండా చూడాలని పారిస్‌లో జరిగిన వాతావరణ సదస్సులో చేసిన నిర్ణయం అమలు చేయడంలో అలసత్వమే కనబడుతుంది. ఇప్పటికే 1.1 డిగ్రీ సెంటీగ్రేడ్ పెరిగిందని ఇంటర్ గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ నివేదిక హెచ్చరిస్తుంది. 2030 నాటికి కర్బన ఉద్గారాల స్థాయిని 50 శాతం తగ్గించాల్సి ఉండగా మరో 16 శాతం పెరుగుతుందన్నది తాజా నిర్ధారణ. అంటే మన ప్రయాణం ఎటు పోతుందో అర్థం కావడం లేదు. ప్రతి రెండు నిమిషాలకు ఒకరు కాలుష్యానికి బలైపోతున్నారని తెలియజేసింది. ఇటీవల ఈజిప్టులోని షర్మ్ ఎల్ షేక్‌లో రెండు వారాలుగా జరిగిన వాతావరణ సదస్సు ఏమంత గొప్ప నిర్ణయాలు చేయకుండానే, వాతావరణ మార్పుల వల్ల దెబ్బతిన్న పేద దేశాలను ఆదుకునేందుకు విపత్తు పరిహార నిధిని ఏర్పాటు చేయడానికి సంపన్న దేశాలు అంగీకరించడంతో పరిహాసంతో సరిపెట్టు కుంది ఈ సదస్సు. 30 ఏళ్లుగా లాస్ అండ్ డ్యామేజెస్ ఒప్పందం మీద చర్చను ప్రతిఘటిస్తూ వచ్చిన ధనిక దేశాలు ఇన్నాళ్లకు ఒప్పందం కుదుర్చుకోవడం స్వాగతించాల్సిన విషయమే అయినప్పటికీ దశాబ్దాలుగా కాలుష్య ఉద్గారాలను నియంత్రించడంలో నివారించడంలో విఫలం చెందింది. వాతావరణం నిధి కోసం ఏటా పది వేల కోట్ల డాలర్లు ఇస్తామని అభివృద్ధి చెందిన దేశాలు దశాబ్దం క్రితం ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. దీంతో కొత్త పరిహార నిధి ఏ మేరకు నెరవేర్చబడుతుందో అనుమానమేనని నిపుణులు అంటున్నారు. ఇలా ఏళ్లకు ఏండ్లుగా సదస్సులు నిర్వహించుకుంటున్న మట్టిని సంరక్షించుటకు తద్వారా మానవాళిని కాపాడుటకు సమర్థవంతమైన తగిన చర్యలు తీసుకోకుండానే నిర్లక్ష్య వైఖరితో పర్యావరణ వినాశన ప్రక్రియలను కొనసాగిస్తూ ముందుకెళుతుండడం అత్యంత విషాదకరం. కనుక ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై జగ్గీ వాసుదవ్ మాదిరిగా మట్టిని సంరక్షించడానికి రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రికవర్.. ఈ నాలుగు కారకాలను ఉపయోగించి మట్టిని కాపాడుకోవాల్సిన అవసరం మన ముందు వున్న తక్షణ కర్తవ్యం. ❍



## వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

### మేషం



భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యం. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఊహించని వార్తలు వింటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి, సహనం అలవరచుకుంటే మంచిది. శత్రువులు మిత్రులవుతారు. స్థిరాస్థి యోగం.

### వృషభం



ఆహార, ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. వారాంతంలో ఉత్సాహంగా గడుస్తుంది. స్త్రీలకు స్థిరాస్తి యోగం. సాహితీ మిత్రులను కలుసుకుంటారు. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలం. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఉద్యోగులకు స్థాన చలనం. వృత్తి విద్యాకోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది.

### మిథునం



నూతన వాహన యోగం. శుభ కార్యాలకు హాజరవుతారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయస్ఫూర్తితో సర్దుబాటు చేసుకుంటారు. క్రయ-విక్రయాలు బాగుంటాయి. విదేశీ ప్రయాణ ఆలోచనలు చేస్తారు.

### కర్కాటం



ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి వారాంతంలో పూర్తి చేస్తారు. సామాన్య ధన లాభం. బ్యాంకు రుణాలు మంజూరు. కుటుంబంలో ఐకమత్యం కొరవడుతుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య సమస్యలుంటాయి.

### సింహం



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. చిరకాల కోరిక తీరుతుంది. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు/పత్రాల పట్ల జాగ్రత్తగా ఉండండి. కుటుంబంలో కలతలకు ఆస్కారం. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. సంయమనం అలవరచుకోండి.

### కన్య



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలున్నాయి. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్యాంకు రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. హోల్ సేల్ వ్యాపారులకు బాగుంటుంది. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.

### తుల



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. స్త్రీలకు శుభ యోగం. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. శత్రువులు మిత్రులవుతారు. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉంటే మంచిది. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. తీర్థ యాత్రలు చేయాలన్న ఆలోచన ఫలిస్తుంది. ఆకస్మిక సంఘటనలు జరుగుతాయి.

### వృశ్చికం



సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. కుటుంబంలో స్వల్ప మనస్పర్థలకు ఆస్కారం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అందరూ మీ మాటే వింటారు. అనాథాశ్రమాలకు ఆర్థిక చేయూతనిస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. ఫలితాలు కూడా అలాగే ఉంటాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. దేశాంతర ప్రయాణ సూచన.

### ధనుస్సు



శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవచ్చు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించండి. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలించే సూచనలున్నాయి. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. బ్యాంకు రుణాలు తీరుస్తారు.

### మకరం



అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. వృధా ఖర్చులను నియంత్రించడం మంచిది. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలకు వారాంతంలో పరిష్కారం లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. కాలానుగుణంగా చేసే వ్యాపారాలు చేసేవారికి ఆశాజనకంగా ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలు అధికంగా ఉన్నాయి.

### కుంభం



ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది.

### మీనం



మొండి బకాయిలు వసూలవుతాయి. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వృత్తి వ్యాపారస్తులకు పోటీ ఏర్పడుతుంది. వృధా కాలక్షేపం చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించండి.



# సరదాగా కాసేపు నవ్వుకోండి

### ఎవరు రాసారు?

టీచర్: వేమన శతకం రాసింది ఎవరు?
విద్యార్థి: తెలియదు సార్!
టీచర్: సరే, నేను నీకు ఒక క్లూ ఇస్తాను.. నేను అడిగిన ప్రశ్నలోనే సమాధానం ఉంది.
విద్యార్థి: శతకంగారు సార్.
టీచర్: ఆ...

### రోజూ ఇదే చెప్తున్నారు...

టీచర్: బంటీ! నీకు ఎన్ని సార్లు చెప్పాలి? హోం వర్క్ చేయని వారిని ఇంటికి పంపిస్తానని..
బంటి: మీరు రోజూ ఇలాగే చెబుతున్నారు టీచర్.. ఒక్క రోజైనా పంపడం లేదు. ఈ రోజైనా పంపించండి టీచర్.

**- పవన్ కుమార్,** మోత్కురావుపేట్

### చలి ఎక్కువైందిగా!

"అదేంటి.. ఈ మధ్య పొద్దున్నే లేచి బట్టలన్నీ ఇస్త్రీ చేస్తున్నావు?" అడిగింది వనజ.
"చలి పెరిగిందిగా" కూల్‌గా చెప్పింది సుజాత.

### కళ్లజోడు పెట్టుకోవచ్చుగా!

"రైలు వేగం తగ్గింది.. ఏమైంది?" అడిగింది భార్య.
"పొగమంచువల్ల డ్రైవర్‌కి పట్టాలు సరిగ్గా కనిపించడం లేదట" చెప్పాడు భర్త.
"అలాగైతే కళ్లద్దాలు పెట్టుకోవచ్చుగా" అంది భార్య.

**- దండెం రాజయ్య,** డోర్నకల్

### తెలిసిపోతుందని..

ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణ..
"భూకంపం సంభవిస్తుందని తెలపడంతో అందరూ బయటికి వచ్చారు, ఒక్క రామారావు తప్ప.
ఎందుకో తెలుసా?" అన్నాడు మొదటి స్నేహితుడు.
"బయటకు వస్తే తాను ఇంట్లోనే ఉంటున్నానన్న విషయం అప్పులు ఇచ్చినవాళ్లకి తెలిసిపోతుందని" రెండో స్నేహితుడు కూల్‌గా చెప్పాడు.

### షేర్ మార్కెట్ అచ్చిరాదు

తాను కొన్న కంపెనీ షేర్ల ధరలు తగ్గుతుండడంతో సుబ్బారావుకు ఏం చేయాలో పాలు పోక ఒక జ్యోతిష్యుని సంప్రదించాడు.
అతను.. సుబ్బారావు చేతిరేఖలు, జాతక చక్రం చూసి "నీకు షేర్ మార్కెట్ అచ్చిరాదని" ఖరాఖండిగా చెప్పాడు.
ఇంతలో ఆ జ్యోతిష్యుని ఫోన్ మోగింది.
విషయం విని అతని మొహంలో రంగులు మారాయి.



అడగక ముందే ఆ జాతక చక్రవర్తి "తాను కొన్న కంపెనీ షేర్ల ధరలు పడిపోయాయని" చెప్పాడు.

### బ్రాండ్ నేమ్

సుబ్బారావును డైరెక్టర్ పదవి నుంచి తీయడానికి కంపెనీ జనరల్ మీటింగ్ జరుగుతోంది. అందరూ ఏకాభిప్రాయానికి రావడంతో సుబ్బారావుకు చివరగా ఒక అవకాశం ఇచ్చారు.
"నా వల్ల మన కంపెనీ సేల్స్ తగ్గుతున్నాయని అనుకుంటే నన్ను తొలగించండి" అని చెప్పాడు.
బోర్డు ఆ పని చేయలేకపోయింది.
కారణం ఆ కంపెనీ అమ్మేది సుబ్బారావు బ్రాండ్ పేరుతోనే.

**- కె.లవారి,** కరీంనగర్

### మన వీధి కాదుగా!

ఆడకుక్క: బావా, బంగార్రాజు గారి ఇంటి దగ్గర ఫంక్షన్ ఉంది వస్తావా?
మగ కుక్క: పక్క వీధి కుక్క ఈ వీధి ఫంక్షన్‌కి వచ్చిందని ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో!
ఆడకుక్క: అందంతా నేను చూసుకుంటానుగా!
మగ కుక్క: అయితే ఓకే.

### రాఖీ

పోలీసు: ఏయ్! ఆగు.. దొంగతనం చేసి పరుగెడుతున్నావా?
పరుగెడుతున్న వ్యక్తి: కాదండి బాబూ, నా మాట నమ్మండి. నేను ప్రేమిస్తున్న అమ్మాయి రాఖీ కట్టడానికి వస్తోంది. అందుకని పరుగెడుతున్నాను.

### తప్పించుకుని...

భార్య: డ్యూటీ నుంచి రావటానికి యింత ఆలస్యం ఎందుకైంది?
భర్త: అదా మరి.. అప్పులు ఇచ్చినవాళ్లని తప్పించుకుని ఇంటికి చేరటానికి ఈ టైమ్ అయింది.
గుర్తుందా?

### గుర్తు లేదు..

సుబ్బారావు: అప్పారావుగారూ! నేను సుబ్బారావుని, మీకు ఐదు వేలు అప్పు ఇచ్చాను. ఇప్పుడు గుర్తొచ్చానా?
అప్పారావు: నాకు లక్ష రూపాయలు అప్పు ఇచ్చినవాళ్లే గుర్తుండరు.
సుబ్బారావు: ఆ....

### కనిపించకుండా...

భర్త: వర్షం రావటం లేదుగా! గొడుగు ఇస్తున్నావెందుకు?
భార్య: అప్పులున్నాయిగా... మీ ముఖం ఎవరికీ కనబడకుండా ఉండటానికి.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

సింగిల్ పేజీ కథ

# తిక్క శంకరయ్య

ఓట్ర ప్రకాశ్‌రావు

**శంకరయ్య** ఆ చెట్టుకిందకు వచ్చాడు. అప్పటికే తన స్నేహితులు ముగ్గురు ముచ్చటించుకొంటున్నారు. "శంకరయ్యా! పట్నం వెళ్లి ఇప్పుడేనా రావడం, ఏమిటి విశేషం?"

"చెబితే మీరు నమ్మరు. కానీ చెప్పకుండా ఉండలేకపోతున్నాను"

"అంతగా నమ్మలేని నిజం ఏమిటి శంకరయ్యా". శంకరయ్య చావుకబురు చల్లగా చెప్పినట్లు చెప్పగానే అక్కడి వారందరూ ఉలిక్కిపడ్డారు. శంకరయ్య తిక్క శంకరయ్య అయ్యాడన్న భావన అందరిలోనూ కలిగింది. శంకరయ్య వైపు బాధగా చూసారు.

తన వైపు బాధగా చూడటం గమనించి "నాకు తెలుసు.. ఈ సంగతి చెప్పగానే మీరు బాధపడతారని. మన దేశంలో ప్రజాస్వామ్యం పెడదారి తొక్కుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా టెన్షనుగా ఉందిరా. కాస్సేపు గుడిలోకెళ్లి ధ్యానంలో కూర్చొని వస్తాను" అంటూ వెళ్లాడు.

శంకరయ్య అటు గుడి వైపు వెళ్లగానే ఆ ముగ్గురూ బాగా చర్చించుకొని ఒక నిర్ణయానికి వచ్చారు.

ఆ ముగ్గురూ శంకరయ్య ఇంటికి వెళ్లారు. వాళ్ల శంకరయ్య ప్రవర్తనలో అనుమానం ఉన్నదంటూ జరిగింది చెప్పారు.

శంకరయ్య భార్య ఒక్కసారిగా భోరుమని విలపించింది. కాస్సేపు తరువాత "ఇంటిగుట్టు వ్యాధి రట్టు" అంటారు. మీరు ఎవరికీ చెప్పవద్దండీ" కళ్లు తుడుచుకొంటూ అంది. "పిచ్చి ముదరక ముందే ఇప్పుడే వైద్యం చేయించడం మంచిదని చెప్పడానికి వచ్చామన్నారు".

"ఉద్యోగాల వల్ల మా పిల్లలు చాలా దూరంలో ఉన్నారు. మా బంధువులకు తెలిసిందంటే పరువు పోతుంది. మీరు మా ఆయనకు ప్రాణస్నేహితులు. ఎవరికీ తెలీకుండా మీరే వైద్యం చేయించి పుణ్యం కట్టుకోండి. ఎంత ఖర్చయినా భరిస్తాను అన్నయ్యా" అంటూ ముగ్గురి వైపు చూస్తూ చేతులు జోడించింది.

ముగ్గురూ పట్నం వెళ్లడానికి నిశ్చయించుకొన్నారు. శంకరయ్య గుడి నుండి ఇంటికి రాగానే తన మిత్రులను చూసి ఆశ్చర్యపడ్డాడు.

"నీ కోసం ఇంటికి వస్తే నీవు..." అన్నాడు మిత్రుడు. "అదేమిట్రా! మీతో చెప్పేకదా గుడికెళ్లాను. మీకేమైనా తిక్క పట్టిందా?" అన్నాడు శంకరయ్య.

"ఆ తిక్క గురించి ఇప్పుడెందుకూ? అసలు సంగతి ఏమిటంటే మేమంతా పట్నం వెళ్లదలచుకొన్నాం. నిన్నూ పిలుచుకొని పోదామని వచ్చాం".

"నేను రాను, మీరెళ్లండి"

"మేం ఎందుకు వెళ్తున్నామో నీకు తెలీదు, నీవడిగినా మేం చెప్పం. అదొక సస్పెన్స్. నీవు రానంటే మా ప్రోగ్రాం రద్దు చేసుకొంటాం" "ఎప్పుడూ మీరు ముగ్గురూ కలిసి ఇలా అడగలేదు, సరే వస్తానులే" అని చెప్పాడు, శంకరయ్య.

మరో గంటకు పాసింజర్ ట్రైన్ ఎక్కి బయలుదేరారు.

పట్నం చేరాక ఒక ప్రైవేట్ పిచ్చాసుపత్రి దగ్గరకు వెళ్లారు.

"వాళ్లలో ఒకరికి పిచ్చి వున్నట్లుంది. వాడికి తెలియకుండా అడ్మిట్ చేయడానికి వచ్చారు" అని మనసులో నవ్వుకొంటూ అనుకొన్నాడు శంకరయ్య.

శంకరయ్యతో పాటు మరో స్నేహితుడిని కూర్చోబెట్టి ఇద్దరు మాత్రం డాక్టరుతో మాట్లాడటం కోసం లోపలికి వెళ్లారు.

"వాళ్లిద్దరిలో ఎవరు పిచ్చివారో ఇంకాసేపట్లో తెలుస్తుందిలే" అనుకొన్నాడు శంకరయ్య.

"వాళ్లిద్దరూ రావడానికి ఆలస్యం కావచ్చు. బయట మిరపకాయ బజ్జీలు కాలుస్తున్నారు, వెళ్లి తిని వద్దామా?" అన్నాడు శంకరయ్య. కాదు.. అంటే ఏమైనా గొడవ జరగవచ్చన్న భయంతో సరేనంటూ వెళ్లాడు. వేడి వేడి బజ్జీలు తిన్న తరువాత డాక్టరు దగ్గరకు వెళ్లిన మిత్రుల కోసం బజ్జీలు పార్శెల్ కట్టించుకొన్నాడు.

ఆసుపత్రిలోనికి వెళ్తుంటే "మీరిద్దరూ కనబడకపోవడంతో భయపడిపోయాం. ఆతృతతో వెతుక్కుంటూ వచ్చాం" అన్నారు దగ్గరకు వెళ్లి వచ్చిన మిత్రులు.

బజ్జీల పొట్లం అందించగానే అక్కడున్న చెట్టు కింద కూర్చున్నారు. వారిద్దరూ బజ్జీలు తినసాగారు.

బజ్జీలు పార్సెల్ కట్టిన పేపరును పారవేయబోతూ అందులో చిన్నగా వున్న వాక్యాలను చదువుతూ "ఒరే! మనమే పొరపాటు పడ్డాం. మన శంకరయ్యకు తిక్క లేదు. మనమే పిచ్చివాళ్లలా ప్రవర్తించాం అంటూ ఆ పేపరు అందించాడు.

"శంకరయ్యా! నీవు చెప్పింది మేమెవరమూ నమ్మలేకపోవడంతో నిన్ను పిచ్చివాడిలా గుర్తించాం" అంటూ జరిగిందంతా చెప్పాడు.


"మీరు మ్యాచ్ చూడకపోయినా మీకందరికీ విరాట్ కోహ్లీ వీరోచితంగా ఆడి పాకిస్తాన్‌తో క్రికెట్‌లో గెలిచిన విషయం తెలుసు. ఎందుకంటే మీడియావారు గొప్పగా ప్రచారం చేశారు రిషి సునాక్ బ్రిటన్ ప్రధాని కావడం గొప్పగా ప్రచారం చేశారు. అందుకే మీకు ఆ డాక్టరుకు తెలిసింది. రిషి సునాక్ ఎన్నికల్లో గెలవడానికి ఎంత ఖర్చు పెట్టాడన్న సంగతి మీడియావారు గొప్పగా చెప్పలేదు. ఏదో ఒక పార్టీ నాయకుడు ప్రెస్ మీటింగులో చెబితే చిన్న అక్షరాలతో న్యూస్ పేపర్‌లో వేశారు. ఆ సంగతి నేను చెప్పినా నమ్మకపోవడంతో నన్నొక పిచ్చివాడిగా చేసి పిచ్చాసుపత్రికి తీసుకొచ్చారు. ఇంకా నయం అడ్మిట్ చేయలేదు" కోపంగా అన్నాడు శంకరయ్య.

"ఆ మిరపకాయల బజ్జీలవాడు ఇచ్చిన పార్సెల్ పేపర్‌లో చిన్న అక్షరాలతో రిషి సునాక్ ఎన్నికల వ్యయం 2 లక్షల రూపాయలు మాత్రమే అని ఉండటం చూసాక అసలు సంగతి తెలిసింది. అందుకే రిషి సునాక్ ఎన్నికల వ్యయం 2 లక్షల రూపాయలు మాత్రమే అని చెబితే ఎవరూ నమ్మడం లేదు శంకరయ్యా"

"శంకరయ్యా, ఆ పిచ్చి డాక్టరుకు కూడా ఈ సంగతి తెలీదు. నీవు చెప్పిన రెండు లక్షల రూపాయల ఎన్నికల ఖర్చు గురించి చెప్పగానే వెంటనే నీకు పిచ్చి వుందన్న నిర్ణయానికి వచ్చాడు. ఎందుకో పెద్దగా ప్రచారం చేయలేదు"

"నీవు మామూలు శంకరయ్యవు.. మేమే తిక్క శంకరయ్యలం" అన్న స్నేహితుల మాటలు వినగానే శంకరయ్య చిరునవ్వు నవ్వాడు.

> "శంకరయ్యా! నీవు చెప్పింది మేమెవరమూ నమ్మలేకపోవడంతో నిన్ను పిచ్చివాడిలా గుర్తించాం" అంటూ జరిగిందంతా చెప్పారు.


..అయ్యో.. నేను పొట్టి వాళ్ల స్పెషలిస్టునండీ..!!
DOCTOR
MD,MS,ET
Zakir..
నెట్ రావడం లేదంటే.. ఏవిటో నీ ఆతురత..?
నీకేమి మందులు రాయాలో నాకెవడు చెబుతాడిప్పుడు...?!
Zakir...
కరోనా పోయింది గా..!
అప్పులు పోలేదు గా...!!
Zakir

ఈ వారం కా‘ర్టూన్స్’




దుబాయ్‌లో
వున్న మిరాకిల్ గార్డెన్‌లోని చిత్రాలివి. డెబ్భై వేలకు
పైగా చదరపు మీటర్ల విస్తీర్ణంలో కొన్ని లక్షల రకాలకు
చెందిన పూలసాగు చేస్తున్నారీ తోటలో.. ప్రపంచంలోని అతి
పెద్ద పూలతోట ఇది.





